

కూటమికి సంఘీభావం తెలుపుతున్న మాదిగ కుల సంఘాల ప్రతినిధులు

చంద్రబాబుతోనే మాదిగలకు న్యాయం

▸▸ నమ్మించి మోసం చేసిన జగన్‌ను ఓడించాలి: మంద కృష్ణ మాదిగ

క్రోసూరు, మే 1: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయితేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ అన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరులో బుధవారం టీడీపీ కూటమి ఆధ్వర్యంలో జరిగిన మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సీఎంగా, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ఉంటేనే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమై మాదిగలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. అనేక సందర్భాల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ విస్మరించారని, మాదిగలను మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీలో మాదిగ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా జగన్ మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసి మాల, మాదిగలను చీల్చాడని చంద్రబాబును జగన్ విమర్శించారన్నారు. 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేశారని తెలిపారు. దీంతో 22 వేల మందికి ఉద్యోగాలు, కొన్ని వేల మందికి ఉన్నత విద్యావకాశాలు, విదేశీ అవకాశాలు వచ్చాయన్నారు. మాదిగలకు 14 అసెంబ్లీ సీట్లు ఇచ్చిన చంద్రబాబు మరో ఇద్దరికి రాజ్యసభ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. టికెట్ల పంపిణీలో కూడా జగన్ మాదిగలను మోసం చేశాడన్నారు. కార్యక్రమంలో కృష్ణమాదిగను నరసరావుపేట లోక్‌సభ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సత్కరించారు.

కూటమికే మాదిగల మద్దతు: ఎమ్మార్పీఎస్

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), మే 1: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమికే మాదిగలు, మాదిగ ఉపకులాలు మద్దతు ఇస్తున్నట్టు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఆర్.జె.ప్రకాష్ మాదిగ తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 35సంఘాల సమన్వయంతో చేపడుతున్న రాష్ట్ర పర్యటనలో భాగంగా తాము విశాఖకు వచ్చినట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధిలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్పొరేషన్లనూ నిర్వీర్యం చేసిందని, సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.25 వేల కోట్లు వేరే పథకాలకు మళ్లించిందని మండిపడ్డారు.

ఫొటోలు, వీడియోల మార్ఫింగ్‌తో వ్యక్తిత్వహననం

▸▸ వైసీపీ సోషల్ మీడియాపై సీఈవోకు టీడీపీ మహిళా నేతల ఫిర్యాదు

అమరావతి, మే1 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తుంటే తమ ఫొటోలు, వీడియోలను వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు మార్ఫింగ్ చేసి, మానసికంగా వేధిస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని టీడీపీ మహిళా నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. వైసీపీ వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయట్లేదని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం అమరావతి సచివాలయంలో సీఈవోను ఐటీడీపీ అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష, టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సందిరెడ్డి గాయత్రి, తెనాలి తెలుగు మహిళ అధ్యక్షురాలు పరుచూరి రమ్య కలిసి, గోడు వినిపించారు. తమ ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా చిత్రీకరించి, వైసీపీ సోషల్ మీడియాలో పోస్టింగ్ చేసిన ఫొటోలు, వీడియోల క్లిప్పింగ్‌లను సీఈవోకు అందజేశారు.

జగన్ గెలిస్తే.. జనం బతకలేరు: బీసీవై పార్టీ

అమరావతి, మే1(ఆంధ్రజ్యోతి): జగన్ మళ్లీ గెలిస్తే.. రాష్ట్రంలో ప్రజలు బతకలేరని బీసీవై పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు చాముండేశ్వరిదేవి వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలోకి వస్తే.. మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి, పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలపై ఫిర్యాదు చేశారు. పుంగనూరులో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌పై దాడి చేసిన మంత్రి పెద్దిరెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల పొట్టగొట్టిన జగన్ ఇంటికే: యామినీ శర్మ

వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని 2047నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ చేసేందుకు 24/7 కష్టపడుతున్న ప్రధాన శ్రామికుడు నరేంద్ర మోదీని ఎన్నికల్లో ఓట్లేసి ప్రతి శ్రామికుడూ ఆశీర్వదించాలని, రాష్ట్ర ప్రగతి కోసం ఏపీలో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నాయకురాలు సాధినేని యామినీ శర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మే డే సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి దాంట్లోనూ దోపిడీకి తెరతీసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను రాజకీయ చిత్రంలో కనబడకుండా చేయాలి: రఘురామ

ఆకివీడు, మే 1: 'జగన్‌కు మళ్లీ అధికారం అప్పగిస్తే ప్రజల ఆస్తులు స్వాహా చేస్తారు. అటువంటి జగన్‌ను రాజకీయ చిత్రపటం నుంచి కనపడకుండా చేయాలి' అని నరసాపురం ఎంపీ, ఉండి టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలంలో ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. 'జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రకారం, భూసమస్య ఎదురైతే మూడు నెలల్లోపు సంబంధిత జిల్లా రెవెన్యూ అధికారిని సంప్రదించకపోతే తమ ఆస్తి నష్టపోవాల్సిందే. కూటమి అధికారం చేపట్టిన తర్వాత ఈ తల తిక్క చట్టాన్ని రద్దు చేస్తుంది' అని రఘురామ అన్నారు.

300 కేసుల మద్యం పట్టివేత

తడ, మే 1: పుదుచ్చేరి రాష్ట్రం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మద్యాన్ని సెబ్ అధికారులు పట్టుకున్నారు. తిరుపతి జిల్లా తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద బుధవారం ఉదయం లారీలో తరలిస్తున్న 300 కేసుల (14,400 క్వార్టర్ బాటిళ్లు) మద్యాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మద్యాన్ని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు తీసుకువెళ్తున్నట్లు డ్రైవర్ మహ్మద్ ఫిరోజ్ విచారణలో చెప్పినట్లు సమాచారం.

రూ.5.5 కోట్ల విలువైన ద్రవ రూప గంజాయి స్వాధీనం

చింతపల్లి, మే 1: పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన రూ.5.5 కోట్ల విలువైన ద్రవరూప గంజాయిని, మిషనరీని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామని అల్లూరి జిల్లా చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జి.మాడుగుల మండలం లువ్వసింగి పంచాయతీ అలగం గ్రామానికి చెందిన ఊలంగి ప్రకాశరావు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ ఇసుకబంధ గ్రామంలో రైతుల నుంచి గంజాయి సేకరించి అత్యాధునిక పరికరాలతో ద్రవరూపంలోకి మార్చి కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాడు. బుధవారం చింతపల్లి మండలం బలపం పంచాయతీ ఎర్రగుప్ప గ్రామంలో ద్రవరూప గంజాయి సిద్ధం చేశాడనే సమాచారంతో సీఐ కె.రమేశ్, అన్నవరం ఎస్ఐ రాజారావు సిబ్బందితో దాడులు నిర్వహించినట్టు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా 54.2 కిలోల ద్రవరూప గంజాయి, తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.


కూటమి మేనిఫెస్టో హిట్!!

వివిధ వర్గాల్లో సానుకూల స్పందన

- రేసులో వైసీపీ ఎన్నికల ప్రణాళిక వెనక్కి!
- కూటమి నేతల్లో ఆనందోత్సాహాలు
- మహిళల్లో స్పందన అధికంగా ఉందంటున్న సర్వే ఏజెన్సీలు
- ఆకట్టుకుంటున్న 3 ఉచిత సిలిండర్ల హామీ
- బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా
- ప్రతి నెలా 1,500పైనా ఆసక్తి
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లలోనూ సానుకూలత
- ప్రజల్లోకి కూటమి నేతలు
- చిన్నచిన్న కరపత్రాల రూపంలో ఇంటింటి ప్రచారానికి రెడీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మేనిఫెస్టో రేసులో అధికార పార్టీని ప్రతిపక్ష టీడీపీ కూటమి వెనక్కి నెట్టేసింది. వైసీపీ మేనిఫెస్టోతో పోలిస్తే కూటమి ఎన్నికల ప్రణాళిక బాగుందని.. అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యంగా ఉందన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తుండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 'వైసీపీ కేవలం తాను అమలు చేసిన పథకాలపై ఆధారపడి ఈసారి ఎన్నికల పోరాటం నడిపిస్తోంది. అంతకు మించి పేద వర్గాలకు మరింత సాయం ఇవ్వగలమన్న సందేశాన్ని ఈ మేనిఫెస్టో ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాం. దీంతో వైసీపీ వెనుకబడిపోయిన వాతావరణం క్షేత్ర స్థాయిలో కనిపిస్తోంది' అని టీడీపీకి చెందిన మాజీ మంత్రి ఒకరు బుధవారం మీడియా ప్రతినిధుల వద్ద వ్యాఖ్యానించారు.



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి కూటమి మేనిఫెస్టోను మంగళవారం ఇక్కడ విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్ కూడా హాజరయ్యా రు. దీనికి నాలుగు రోజుల ముం దు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ మేనిఫెస్టోను విడుదల చేశా రు. ఎన్నికల సమరం తీ వ్రంగా ఉండడంతో.. వైసీపీ మేనిఫెస్టోలో పెట్టబోతున్నారం టూ కొన్ని హామీలను ఆ పార్టీకి అనుకూలంగా ఉండే సామాజిక మా ధ్యమాల బాధ్యులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కానీ జగన్ విడుదల చేశాక చూస్తే అవేమీ కనిపించలేదు. సాదాసీదాగా ఉం ది. పాత పథకాలనే కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రస్తావించిన కొత్త అంశాలు పరిమితంగా కనిపించాయి.

పేద మహిళల్లో చర్చ..

తమ మేనిఫెస్టోలోని వరాలపై పేద మహిళల్లో బా గా చర్చ నడుస్తున్నట్లు టీడీపీలోని కింది స్థాయి నేతలు చెబుతున్నారు. 'మేం గ్రామాల్లో వారి ఇళ్లకు వెళ్లి మేనిఫెస్టో గురించి ప్రస్తావించినప్పుడు మహిళలు తమకు తాముగా అందులో అంశాల గురించి చెబుతున్నారు. ఆ వరాలపై ఆసక్తిగా ఉండడం వల్లే అంత త్వరగా వారు స్పందిస్తున్నారు. వైసీపీ మేనిఫెస్టో విడుదలైనప్పుడు ఇటువంటి స్పందన మేం చూడలేదు' అని నంద్యాల జిల్లాలో ఒక మండల స్థాయి టీడీపీ నాయకుడు చెప్పారు. కూటమి మేనిఫెస్టో విడుదలయ్యాక కొన్ని సర్వే ఏజెన్సీలు దానిపై అప్పటికప్పుడు కొన్ని సర్వేలు చేశాయి. పేద మహిళలను కదిలించినప్పుడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు ప్రతి నెలా 1,500 వరాలను ఎక్కువ మంది ప్రస్తావించారని ఒక ఏజెన్సీ ప్రతినిధి చెప్పారు. కూటమి మేనిఫెస్టో హిట్టయిందనడానికి ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం, తాడిపత్రి నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి ఇద్దరు సమీప బంధువులు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి పోటీ చేస్తున్నారు. కొందరు ధర్మవరం వైసీపీ కార్యకర్తలు తాడిపత్రి నియోజకవర్గంలోని గ్రామాల్లో పెద్దిరెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. గ్రామాల్లో రైతులకు ఏటా రూ.20 వేలిస్తామన్న టీడీపీ కూటమి వాగ్దానం ఆకర్షణీయంగా కనిపిస్తోందని, తాడిపత్రి నియోజకవర్గంలో కొందరు తమతోనే ఆ విషయం నేరుగా చెప్పారని ప్రచారంలో పాల్గొంటున్న ఒక వైసీపీ నేత చెప్పారు. వివిధ వర్గాల నుంచి సానుకూల స్పం దన ఎక్కువగా వస్తుండడంతో.. దీనిని మరింతగా ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కూటమి నేతలు నిర్ణయించారు. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మేనిఫెస్టోలోని వరాలను చిన్న చిన్న కరపత్రాలుగా ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు..

వైసీపీ మేనిఫెస్టోతో పోలిస్తే కూటమి తన మేనిఫెస్టోలో పేద వర్గాలకు మరింత మెరుగైన సాయాన్ని ఇస్తామని హామీ ఇచ్చింది. ఇందులో ఆరు హామీలను టీడీపీ శ్రేణులు రాజమహేంద్రవరం మహానాడు నుంచీ ప్రచారం చేస్తున్నాయి. వాటికి తాజా మేనిఫెస్టోలో మరి కొన్ని అదనంగా జోడించారు. కేవలం పేద వర్గాలనే కాకుండా సమాజంలోని భిన్న వర్గాల ఆకాంక్షలను స్పృశిస్తూ దీనిని రూపొందించడంతో వ్యాప్తి పెరిగింది. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల గ్రూపుల్లో మంగళ, బుధవారాల్లో ఈ మేనిఫెస్టోలో తమ గురించి పేర్కొన్న అంశాలపై సానుకూల పోస్టింగులు విపరీతంగా కనిపించాయి. దీనిని సంఘాల నేతలు కూడా ధ్రువీకరిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, బ్రాహ్మణ సామాజిక వర్గానికి సంబంధించిన సామాజిక మాధ్యమ వేదికల్లో కూడా సానుకూల వ్యాఖ్యలు భారీగా దర్శనమిస్తున్నాయి.

అభ్యర్థుల నేరచరిత్ర పత్రికల్లో ప్రచురించాలి

- ఆస్తుల వివరాలు కూడా...: హైకోర్టు ఆదేశం
- సంబంధిత పార్టీ వెబ్‌సైట్‌లోనూ ఉంచాలి
- సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేయాల్సిందే
- ఈసీ, రాజకీయ పార్టీలకు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సంబంధిత రాజకీయ పార్టీల అధికారిక వెబ్‌సైట్లలోనూ వివరాలు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలకు తేల్చిచెప్పింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ... ఏపీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వివరాలను పత్రికల్లో ప్రచురించారా, లేదా అనే వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించి అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్(ఫాం-26)ను తెలుగులో అందుబాటులో ఉంచేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన ఎస్. రమేశ్‌బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత తన నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికల్లో ప్రచురించి, ఓటరుకు తెలియపర్చాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

పోలీసు వాహనాల్లో డబ్బుల చేరవేత!!

- అధికార పక్షానికి పోలీసు అధికారుల ఊడిగం
- విద్యుత్ శాఖ సిబ్బంది కూడా..
- విశాఖలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
- భారీవ్యయంపై కేంద్ర మంత్రి ఆరా
- మద్యం సొమ్ము వాడుతున్నారని కేంద్రానికీ సమాచారం!
- మరి అడ్డుకునే చర్యలేవీ?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోలీసులను జగన్ ప్రభుత్వం ఏ విధంగా వాడుకుంటోందో గత ఐదేళ్లుగా అందరికీ సుపరిచితమే. ఇప్పుడు ఎన్నికల వేళ.. ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో కూడా వారు అధికార పార్టీ కోసం పనిచేస్తున్నారు. ముఖ్యంగా విశాఖ నగరంలో వైసీపీ అభ్యర్థులకు, ఇతరులకు నిధులను పోలీసు వాహనాల్లోనే తరలిస్తుండడం కలకలం రేపుతోంది. ఈ సమాచారం కేంద్రానికి కూడా ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడం గమనార్హం. ఇక విశాఖ నగరంలో వైసీపీ అభ్యర్థులు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు సగటున రోజుకు రూ.20 లక్షలకుపైగా వెచ్చిస్తున్నారని సమాచారం. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కొందరికి ఆ పార్టీ నాయకత్వం తొలి విడతగా రూ.20 కోట్లు చొప్పున అందజేసిందనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధుల పంపిణీ బాధ్యతను ఒక సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు పెద్దలకు అప్పగించారు. వారిలో ఒక్కరు కూడా ప్రత్యక్ష రాజకీయాల్లో లేరు. ఒకరు ప్రముఖ ప్రభుత్వ విద్యా సంస్థలో ఉన్నత స్థానంలో ఉండగా.. మరొకరు పేరొందిన వస్త్ర వ్యాపారి. ఇంకొకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి. ప్రభుత్వ సంస్థకు సదరు వ్యక్తిని రెండోసారి ప్రభుత్వం ఛైర్మన్‌గా నియమించింది. విశాఖ జిల్లాలో ఇద్దరు అభ్యర్థులకు పార్టీ నిధులు ఇవ్వలేదు. వారిద్దరూ సొంత డబ్బే ఖర్చు చేస్తున్నారు. ఒకరేమో పది లక్షలు ఖర్చు చేసి రూ.50 లక్షలు పెట్టామని ప్రచారం చేసుకుంటుండగా.. మరొకరు రూ.50 లక్షలు వెచ్చించినా రూ.10 లక్షలు కూడా అవ్వలేదని చెబుతున్నారు. వీరి సంగతి పక్కన

రాత్రి వేళ కరెంటు తీసేసి పంపిణీ

పెడితే.. అధిష్ఠానం పంపిన డబ్బులను అభ్యర్థులకు, ఇతరులకు చేరవేయడానికి వీరు ఏకంగా పోలీసు వాహనాలనే ఉపయోగిస్తున్నారు. అధికారపార్టీతో అంటకాగి మంచి పోస్టులు పొందిన పోలీసు అధికారుల ద్వారా పోలీసుల వాహనాల్లోనే నగరంలో ఎక్కడకు కావాలంటే అక్కడకు వీరు డబ్బులు సరఫరా చేస్తున్నారు. పోలీసుల వాహనాలను ఎన్నికల టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేయకపోవడం వల్ల వీరు సులువుగా డబ్బును పంపిణీ చేసుకోగలుగుతున్నారు. గత శుక్రవారం రాత్రి అత్యవసరంగా వన్‌టౌన్ ఏరియాకు డబ్బు తరలించాల్సి రావడంతో ఊహించని విధంగా సుమారుగా గంట సేపు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరీ పని పూర్తి చేసుకున్నారు. విద్యుత్ శాఖలో కూడా వైసీపీ నాయకులకు సహకరించేవారు ఉన్నారని దీనిని బట్టి అర్థమవుతోంది. ఈ విషయాలన్నీ ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుసుకున్న ఓ పోలీసు ఉన్నతాధికారి.. తమ శాఖ వాహనాలను కూడా ఎన్నికల విధుల్లో భాగంగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను కోరడం గమనార్హం.

ఓ అధికారి ద్వారా క్రైస్తవ ఓట్లకు గేలం!

విశాఖలో 150కి పైగా క్రైస్తవ సంస్థలతో సంబంధాలు ఉన్నాయని ఒక పెద్ద పాస్టర్‌ను తీసుకొచ్చి ఓ విద్యా సంస్థలో కీలక పదవిలో కూర్చోబెట్టారు. అదే సంస్థలో కీలక స్థానంలో ఉన్నతాధికారి విశాఖ జిల్లాలో క్రైస్తవుల ఓట్లన్నీ అధికార పార్టీకి వచ్చేలా మేనేజ్ చేసేందుకు ఆ పెద్ద పాస్టర్‌ను ఉపయోగిస్తున్నారు. ఆయన ద్వారా చర్చిలు, ఫాదర్లకు నిధులు పంపిణీ చేయిస్తున్నారు. వీరి వాహనాలు తనిఖీ చేసినా నిధులు దొరుకుతాయనేది విశ్వసనీయ సమాచారం.

కేంద్ర మంత్రి ఆరా

రెండ్రోజుల క్రితం కేంద్ర మంత్రి ఒకరు నగరానికి వచ్చారు. భారత్ వికసిత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు బీజేపీ నాయకులు కలిశారు. వైసీపీ నాయకులు భారీగా ఖర్చు చేస్తున్నారని ఆమె దృష్టికి కొందరు తీసుకువెళ్లగా, ఆ నిధులన్నీ అమరావతి నుంచే వచ్చాయనే మరికొందరు వివరించారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన నగదునే ఇలా ఉపయోగించుకుంటున్నారని, కేంద్రం వద్ద పూర్తి సమాచారం ఉందని ఆ మంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

గాజుగ్లాసు గుర్తుపై హైకోర్టు ఆదేశాలను ఈసీ తప్పుగా అర్థం చేసుకుంది

▸▸ అందుకే మళ్లీ కోర్టుకు: టీడీపీ నేత వర్ల

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను అర్థం చేసుకుని జనసేన పార్టీ పోటీ చేయని స్థానాల్లో, ఆ పార్టీకి కేటాయించిన గాజు గ్లాసు గుర్తును ఇంకెవ్వరికీ కేటాయించవద్దని, గాజు గ్లాసు గుర్తును ఫ్రీజ్ చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ గాజుగ్లాసు గుర్తుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్నికల సంఘం తప్పుగా అర్థం చేసుకుందన్నారు. ఎక్కడైతే జనసేన పార్టీ పార్లమెంటుకు పోటీ చేస్తుందో ఆ పార్లమెంటు పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులెవ్వరికీ గాజుగ్లాసు గుర్తు కేటాయించకూడదని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఒక పార్లమెంటు పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క స్థానంలోనైనా జనసేన పోటీ చేస్తున్నట్లయితే మిగిలిన 6 స్థానాలతోపాటు పార్లమెంటుకు పోటీ చేస్తున్న ఇతర పార్టీల అభ్యర్థులకు కూడా గాజు గ్లాసు గుర్తు కేటాయించకూడదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కానీ ఎన్నికల సంఘం మాత్రం కోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకుని జనసేన పోటీ చేయని ఏ స్థానంలోనైనా గాజు గ్లాసు గుర్తును ఎవరైనా కోరితే ఇస్తామని ప్రకటించిందన్నారు. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం తమకు డైరెక్షన్ ఇచ్చిందని సీఈవో చెబుతున్నారన్నారు. దీంతో తాము మళ్లీ కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. కూటమి విజయాన్ని ఆపాలని కొందరు ప్రయత్నిస్తున్నారని వర్ల ఆరోపించారు.

వైసీపీకి తొత్తులుగా అధికారులు

ఎమ్మెల్యేకు బంధువవడంతో వైసీపీకి ఓటు వేయండని అనంతపురంలో పనిచేస్తున్న డీఎస్పీ వీర రాఘవరెడ్డి బహిరంగంగా ప్రచారాలు చేస్తున్నారని, కనుక ఆయన్ను తక్షణమే ఎన్నికల విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారాలు చేస్తున్న విశాఖపట్నం వైసీపీ ఎంపీ సత్యనారాయణపై కూడా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఎవరైనా టీడీపీకి ఓటు వేస్తే ఊరినించి బహిష్కరిస్తామని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, కూటమి మేనిఫెస్టోను అన్ని వర్గాలు అభినందించారని, వైసీపీ మేనిఫెస్టోను ఎవ్వరూ నమ్మడం లేదని, కనీసం పట్టించుకోవడం లేదని వర్ల అన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే కూటమికి మద్దతు: కేసన

భట్టిప్రోలు, మే 1: రాష్ట్ర ప్రజల భవిష్యత్, భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేసన శంకరరావు తెలిపారు. బుధవారం బాపట్ల జిల్లా భట్టిప్రోలులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో కూటమికి మద్దతుగా ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు చెప్పారు.

16 నుంచి ఈఏపీసెట్

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్-2024 పరీక్షలు ఈ నెల 16న ప్రారంభం కానున్నాయి. హాల్‌టికెట్లను ఈ నెల 7 నుంచి ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మండలి ఓ ప్రకటనలో తెలిపింది.

వైసీపీ నేత గోదాంలో తాయిలాలు

▸▸ 107 చీరలు, 87 షర్ట్‌ప్యాంట్ బిట్‌లు పట్టివేత



ముక్తినూతలపాడులో ఉన్న వైసీపీ నేత గోదాములో తనిఖీలు చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

ఒంగోలు(క్రైం), మే 1: ఒంగోలు నగర పరిధిలోని వైసీపీ నాయకుడు రాయిపాటి అంకయ్యకు చెందిన గోదాంలో నిల్వ ఉంచిన 107 చీరలు, 87 జతల ఫ్యాంట్, షర్ట్ బిట్‌లను సీజ్ చేశారు. పక్కాగా అందిన సమాచారం మేరకు బుధవారం ముక్తినూతలపాడులోని వైసీపీ నేతకు చెందిన గోదాంలో నిల్వలపై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు చేసింది. వారి తనిఖీలలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు మూడు బాక్సులలో దాచి ఉంచిన చీరలు, ఫ్యాంట్, షర్ట్ బిట్‌లు దొరికాయి. ఆ చీరల పెట్టెలు, కవర్లపై సీఎం జగన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలు ఉన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి పేరుతో ఉన్న సంచులు కూడా భారీగా ఉన్నాయి. వాటిని సీజ్ చేసిన అధికారులు తాలూకా పోలీసులకు అప్పగించారు. కాగా వైసీపీ నేత అంకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు.

మేలోనూ మంటలే!

▸▸ సాధారణం కంటే అధికంగానే పగటి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎల్‌నినో బలహీనపడినా దాని ప్రభావంతో దేశంలోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం అగ్నిగుండంలా మారాయి. ఏప్రిల్‌లో మాదిరిగానే ఎండ తీవ్రత, వడగాడ్పులు మే నెలలో కొనసాగనున్నాయి. మే నెలకు సంబంధించి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు, వర్షపాతంపై బుధవారం భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం.. కోస్తాంధ్రలో ఎక్కువ ప్రాంతాలు, దానిని ఆనుకుని ఉన్న తెలంగాణలో సాధారణం, అంతకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఏపీ, ఉత్తర తెలంగాణల్లో సగటున రెండు నుంచి నాలుగు రోజులు వడగాడ్పులు వీయనున్నాయి.

వర్షాలు లేకపోవడంతో ఏప్రిల్‌లో ఎండలు

మార్చి నుంచి మే నెలాఖరు వరకు దేశంలో రుతుపవన ముందస్తు వర్షాలు కురవడం సాధారణ విషయం. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దక్షిణ భారతంలో రుతుపవన ముందస్తు వర్షాలు లేకపోవడంతో ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు, వడగాడ్పులు వీచాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర పేర్కొన్నారు. ఇంకా అధిక పీడనం కొనసాగడంతో గాలుల వేగం మందగించి రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించారు. మే నెలలో రాయలసీమలో అనేక ప్రాంతాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కానున్నాయి. అయితే దక్షిణ కోస్తాలో ప్రకాశం జిల్లా తప్ప మిగిలిన ప్రాంతాల్లో తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పెరిగిన సెగ, ఉక్కపోత.. జంగమహేశ్వరపురంలో 46.2 డిగ్రీలు

అమరావతి, విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత, వడగాడ్పులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పగలు సెగ, రాత్రి వేళ ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో అనేక ప్రాంతాలు బుధవారం ఎండతో మండిపోయాయి. రాయలసీమ, కోస్తాల్లోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురం, పల్నాడు జిల్లా కొప్పునూరులో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 46, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో 45.8, నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా మర్రిపాడులో 45.7,చిత్తూరు జిల్లా కొత్తపల్లిలో 45.6, ప్రకాశం జిల్లా ఎంద్రపల్లిలో 45.5, కడప జిల్లా సింహాద్రిపురంలో 44.9, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 44.6, అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 44.5, కర్నూలు జిల్లా పంచలింగాలలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాడ్పులు, దక్షిణ కోస్తా, ఉత్తరకోస్తాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

'గాజుగ్లాసు'పై గందరగోళం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ టీడీపీ హైకోర్టును ఆశ్రయించింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున.. గాజుగ్లాసు గుర్తును ఇతర స్వతంత్ర అభ్యర్థులెవరికీ కేటాయించకుండా జనసేనకే రిజర్వ్ చేసేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య బుధవారమే అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు గానీ, స్వతంత్ర అభ్యర్థులకు గానీ ఈ గుర్తును కేటాయించకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై కోర్టు గురువారం విచారణ జరుపనుంది. 'జనసేనకు కేంద్ర ఎన్నికల సంఘం గాజుగ్లాసును ఎన్నికల గుర్తుగా కేటాయించింది. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కూటమిగా పోటీ చేస్తున్నాయి. పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా టీడీపీ 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాలకు.. జనసేన 21 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాలకు.. బీజేపీ 10 అసెంబ్లీ, 6 ఎంపీ స్థానాలకు పోటీ చేస్తున్నాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ప్రచారం కూడా చేస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోను సైతం విడుదల చేశాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈసీ కేటాయించిన గుర్తులను అభ్యర్థులు ఓటర్ల దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల గుర్తుది కీలక పాత్ర. అభ్యర్థుల పేర్లను చదవలేని నిరక్షరాస్యులైన ఓటర్లు.. ఎన్నికల గుర్తును ఆధారంగా చేసుకుని తమ ఓటుహక్కు వినియోగించుకుంటారు. నిబంధనలను అనుసరించి ఈసీ జనసేనకు గాజుగ్లాసు గుర్తు కేటాయించింది. ఫ్రీ సింబల్ జాబితాలో ఉన్న ఈ గుర్తును ఆ జాబితా నుంచి తొలగించి తమకు రిజర్వ్ చేయాలని ఆ పార్టీ ఈసీకి విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ ఆ గుర్తును స్వతంత్ర అభ్యర్థులు, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులకు కేటాయించారు. ఈ నేపథ్యంలో జనసేన హైకోర్టును ఆశ్రయించగా.. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాలు ఉన్న లోక్‌సభ నియోజక వర్గాల్లో పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు, జనసేన పోటీలో ఉన్న రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఇతర స్వతంత్ర, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలకు గాజుగ్లాసు సింబల్ కేటాయించి ఉంటే సవరించాలని ఆర్వోలను ఆదేశించినట్లు ఈసీ హైకోర్టుకు నివేదించింది. కమిషన్ ఉత్తర్వులు ఓటర్లను మరింత గందరగోళంలోకి నెడుతున్నాయి. 62 అసెంబ్లీ, 5 పార్లమెంటు నియోజకవర్గాలకు ఈసీ ఉత్తర్వులు వర్తించడం లేదు. జనసేనకు సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించాలని కమిషన్ తీసుకున్న నిర్ణయం కూటమి అభ్యర్థుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. ఈసీ నిర్ణయం ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసే పార్టీలు, అభ్యర్థుల సమానావకాశాలను దెబ్బతీస్తుంది. ప్రతికూల పరిస్థితులు కల్పిస్తుంది. పోటీ చేసే అభ్యర్థులు, ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల గుర్తుల కేటాయింపు.. నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుంది. మా హక్కులకు భంగం కలుగుతున్న నేపథ్యంలో వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపండి' అని పిటిషన్‌లో రామయ్య కోరారు.

'గాజుగ్లాసు'పై ఆర్వోలకు ఆదేశాలిచ్చాం: ఈసీ

జనసేన పోటీ చేసే 21 అసెంబ్లీ స్థానాలు ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపులేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలకు గాజుగ్లాసు గుర్తు కేటాయించవద్దని ఆర్వోలను ఆదేశించినట్లు ఈసీ అంతకుముందు హైకోర్టుకు తెలిపింది. అలాగే జనసేన పోటీ చేస్తున్న రెండు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న స్వతంత్ర, గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలకు ఈ సింబల్ కేటాయించవద్దని, ఒకవేళ కేటాయించి ఉంటే సవరించాలని వారిని నిర్దేశించినట్లు నివేదించింది. ఈ నిర్ణయంతో ఈ పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపింది. ఈసీ నిర్ణయంపై జనసేన ప్రధాన కార్యదర్శి టి.శివశంకర రావు తరఫు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేయడంతో న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ వ్యాజ్యంపై విచారణను ముగించారు. అయితే ఈసీ నిర్ణయం కూటమిలోని ఇతర భాగస్వాములను అయోమయంలో పడేసిందని టీడీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ ఇబ్బందులను జనసేన కూడా గుర్తించింది. మరోసారి కోర్టును ఆశ్రయించే ఆలోచనలో ఉంది.



అబ్ కీ బార్?

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

లోక్‌సభ ఎన్నికలతో 9 లక్షల మందికి ఉద్యోగాలు!

ముంబయి, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించడంతోపాటు పెద్ద ఎత్తున తాత్కాలిక ఉద్యోగావకాశాలనూ కల్పిస్తున్నాయి. 7 దశల్లో నిర్వహిస్తున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా 9 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ స్థాయిల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల సామగ్రిని తరలించే సిబ్బంది వంటివారిని తాత్కాలికంగా నియమిస్తుంటారు. వీరితో పాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియమించుకునే సిబ్బంది, సర్వేలు నిర్వహించేవారు ఇలా అందరినీ లెక్కేస్తే దాదాపు 9 లక్షల మందికి తాత్కాలిక ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

బీజేపీ ఉన్నంత వరకూ రిజర్వేషన్లు ఉంటాయి

» మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ రాతపూర్వక హామీ ఇవ్వగలదా?: మోదీ



బనస్కంత, కోర్బా, న్యూఢిల్లీ, మే 1: మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలనేదే కాంగ్రెస్ ఉద్దేశం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఒకవేళ మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వబోమని కాంగ్రెస్ చెప్పదలచుకుంటే.. ఆ విషయాన్ని ఆ పార్టీ, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు రాతపూర్వకంగా ఇవ్వగలవా? అని ప్రశ్నించారు. మతం పేరిట రిజర్వేషన్లను దుర్వినియోగపరచబోమంటూ కాంగ్రెస్ రాకుమారుడు చెప్పగలారా? అని రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా మోదీ నిలదీశారు. గుజరాత్‌లోని బనస్కంత జిల్లాలోని దీసా పట్టణంలో బుధవారం ఓ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. తాను, బీజేపీ ఉన్నంత వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రకటించారు. కాగా, రిజర్వేషన్లను తాము తొలగించబోమని, ఆ పనికి సిద్ధమైతే కాంగ్రెస్‌నూ అడ్డుకుంటామని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాలోని కట్గోరా పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో షా మాట్లాడారు. అబద్ధాలను బహిరంగంగా, బిగ్గరగా, పదే పదే చెప్పడం కాంగ్రెస్ నైజం అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఒక కుటుంబం కోసం అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, చివరికి ఎన్నికల్లో ఓటమికి ఆయన్నే బాధ్యులను చేస్తారని పేర్కొన్నారు.

మోదీ హటావో.. దేశ్ బచావో: ఖర్గే

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి): 'మోదీ హటావో.. దేశ్ బచావో' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓటర్లకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం యాదగిరిలో బుధవారం నిర్వహించిన ప్రచారసభలో ఖర్గే ప్రసంగించారు. ప్రధాని మోదీని గద్దె దించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన ఓటర్లను కోరారు. ఈనెల 7న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. యాదగిరి ప్రాంతం ఒకప్పుడు హైదరాబాద్ నిజాంల పాలనలో ఉండేదని, హిందూ ముస్లింల మధ్య విభేదాలు ఉండేవి కావని తెలిపారు. అయితే ప్రధాని మోదీ ఇక్కడ చిచ్చు రేపుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. కేవలం ఓట్ల కోసమే శ్రీరాముడు, అయోధ్య వంటి అంశాలను మోదీ ప్రస్తావిస్తున్నారని ఆక్షేపించారు. పేదలు ఇంతవరకు పేదలుగానే ఉండగా ధనవంతులు శ్రీమంతులయ్యారన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఇద్దరు నేతల రాజీనామా

న్యూఢిల్లీ, మే 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. ఢిల్లీలోని రెండు లోక్‌సభ స్థానాలకు చెందిన ఆ పార్టీ పరిశీలకులు నీరజ్ బసోయా, నసీబ్ సింగ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యేలయిన నీరజ్ బసోయాను పశ్చిమ ఢిల్లీకి, నసీబ్ సింగ్‌ను నార్త్‌వెస్ట్ ఢిల్లీ లోక్‌సభ స్థానాలకు పరిశీలకులుగా కాంగ్రెస్ పార్టీ ఇటీవలే నియమించింది. అయితే బుధవారం వారు ఇరువురూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వేర్వేరుగా లేఖలను రాశారు. ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్లే తాము పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పొత్తుతో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి రోజూ అవమానాల పాలవుతున్నారని నీరజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర నాయకత్వంతో విభేదాల కారణంగా కాంగ్రెస్ సీనియర్ నేత అరవిందర్ సింగ్ లవ్లీ పార్టీ ఢిల్లీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

తొలి విడత 66.14%
రెండో విడతలో 66.71%

» పోలింగ్ తుది వివరాలు వెల్లడించిన ఈసీ
» పోలింగ్ శాతం పెరగడంపై మమత డౌట్
» ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానం



మాల్దా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో మమత

న్యూఢిల్లీ, ఫరక్కా (పశ్చిమ బెంగాల్), మే1: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన మొదటి, రెండో విడత పోలింగ్ తుది వివరాలను ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. మొదటి విడతలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ పేర్కొంది. తొలి విడత పోలింగ్ ఏప్రిల్ 19న జరగ్గా పోలింగ్‌కు సంబంధించిన తుది వివరాలను 11 రోజుల తర్వాత ఈసీ అధికారికంగా మంగళవారం వెల్లడించింది. ఈ విడతలో 66.22% మంది పురుషులు, 66.07% మంది మహిళలు, 31.32% మంది థర్డ్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో జరిగిన మొదటి విడతలో పోలింగ్ 69.43 శాతంగా నమోదైంది. ఇక రెండో విడత విషయానికి వస్తే.. ఈ విడత పోలింగ్ ఏప్రిల్ 26న జరిగింది. ఇందులో 66.99% మంది పురుషులు, 66.42% మంది మహిళలు, 23.86% మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఓటు వేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండో విడతలో పోలింగ్ 69.64 శాతంగా నమోదైంది. కాగా మొదటి విడతలో బిహార్‌లో తక్కువ (49.26 శాతం), రెండో విడతలో ఉత్తర ప్రదేశ్‌లో తక్కువ (55.19 శాతం) పోలింగ్ జరిగింది. మొదటి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరగ్గా.. 11చోట్ల మహిళల ఓటింగే ఎక్కువగా ఉందని ఈసీ వెల్లడించింది. వీటిలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్మూకశ్మీర్, తమిళనాడు, లక్షద్వీప్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. రెండో విడతలో 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరిగింది. వీటిలో ఆరు చోట్ల మహిళల ఓటింగ్ అధికంగా ఉంది. వీటిలో అస్సాం, బిహార్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, కేరళ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తర్వాత పోలింగ్ తుది వివరాలు అందుబాటులో ఉంటాయని ఈసీ స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన తొలి, రెండో విడత పోలింగ్ తుది వివరాల వెల్లడిలో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేసిన జాప్యం పట్ల పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఈ రెండు విడతల్లో ఒక్కసారిగా పోలింగ్ శాతాలు పెరగడంపై బుధవారం ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన దానికంటే పోలింగ్ తుది వివరాల్లో దాదాపు 5.75% పెరుగుదల ఆందోళన కలిగిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. చాలా కాలంగా ఈవీఎంలు కనపడకుండా పోయినందు వల్ల బీజేపీ ఫలితాలను తారుమారు చేస్తుందనే ఆందోళనలున్నాయన్నారు. పోలింగ్ శాతం పెరుగుదల ఆందోళనకలిగించడమేకాకుండా ఈవీఎంల విశ్వసనీయతపై తీవ్ర భయాందోళనలు కలిగిస్తోందని చెప్పారు. ముర్షీదాబాద్ జిల్లాలోని ఫరక్కాలో నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసీ వెల్లడించిన ఓటింగ్ వివరాల పట్ల కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇంతకు ముందు మాదిరిగా పోలింగ్ వివరాలు వెల్లడించడంలో ఈసీ విఫలమవడం అందరినీ నిరాశపరుస్తోందని తెలిపారు. ఆ వివరాలతో రాజకీయ ఆటలు ఆడకూడదని ఆశిస్తున్నామన్నారు.

డీప్‌ఫేక్ వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో 'పిల్'

న్యూఢిల్లీ, మే 1(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించారన్న వివాదం నేపథ్యంలో 'డీప్‌ఫేక్' వీడియోలపై ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తున్నందున డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని, ప్రసారాన్ని అరికట్టేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయవాదుల బృందం ఈ పిల్‌లో కోరింది. సీనియర్ న్యాయవాది జయంత్ మెహతా బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్‌సింగ్ అరోరాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఈ పిటిషన్ గురించి ప్రస్తావించారు. డీప్‌ఫేక్ వీడియోలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఈసీ స్పందించలేదన్నారు. ఎన్నికల వేళ చక్కర్లు కొడుతున్న డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ సక్రమంగా ఉంటే గురువారం విచారణ చేపడతామని తెలిపింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	45.6	29.0
గుంటూరు	45.0	30.0
కర్నూలు	44.5	31.1
అనంతపురం	43.0	30.0
విజయవాడ	42.3	28.3
ఒంగోలు	40.9	28.6
బాపట్ల	38.7	26.9

ప్రజ్వల్‌ను దేశానికి రప్పించండి

» ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం లేఖ

బెంగళూరు, మే 1(ఆంధ్రజ్యోతి):మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టును రద్దు చేయాలని, ఆయనను స్వదేశానికి రప్పించాలని కోరుతూ ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్‌ను ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దింపడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. అతనిపై భయంకరమైన ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వివాదంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వెంటనే ప్రజ్వల్ పాస్‌పోర్ట్‌ను రద్దు చేసేలా కేంద్ర హోం, విదేశాంగశాఖలకు సూచించాలని లేఖలో కోరారు. అతన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు సిట్ అవిశ్రాంతంగా పనిచేస్తోందని సిద్దరామయ్య ఆ లేఖలో తెలియజేశారు. కాగా, ఈ వ్యవహారంలో 24 గంటల్లోగా విచారణకు హాజరు కావాలని ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే రేవణ్ణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మంగళవారం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ప్రజ్వల్ రేవణ్ణ బుధవారం స్పందించారు. ప్రస్తుతం తాను బెంగళూరులో అందుబాటులో లేనని, జర్మనీలో ఉన్నానని పేర్కొన్నారు. విచారణకు హాజరయ్యేందుకు ఏడు రోజుల గడువు కావాలని కోరారు. ప్రజ్వల్ తరఫు న్యాయవాది అరుణ్ ఈ మేరకు సిట్ అధికారులకు లేఖ పంపారు. మరోవైపు ప్రజ్వల్ లైంగిక వేధింపుల వీడియోల పెన్‌డ్రైవ్‌ల విడుదల వెనుక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హస్తం ఉందని జేడీఎస్ నేత కుమారస్వామి చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ తిప్పికొట్టారు. అసలు పెన్‌డ్రైవ్‌లు బయటకు రావడానికి కుమారస్వామి కారణమై ఉంటారన్నారు. ప్రజ్వల్ విదేశాలకు పారిపోడానికి రాష్ట్ర ప్రభుత్వమే సహకరించిందని బీజేపీ చేసిన ఆరోపణలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య తిప్పికొట్టారు. 'విదేశాలకు వెళ్లడానికి పాస్‌పోర్టు, వీసా ఎవరిచ్చారు? కేంద్రమే ఇచ్చింది. కేంద్రానికి తెలియకుండా అతను వెళ్లగలడా?' అని సిద్దరామయ్య ఆరోపించారు. కాగా, మోదీ తన రాజకీయ కుటుంబంలోని నేరస్థులను కాపాడే గ్యారెంటీలో ఇది కూడా భాగమేనా? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. 'కర్ణాటకలో మహిళలపై దారుణమైన నేరాలు జరిగితే, నరేంద్ర మోదీ సిగ్గులేకుండా ఎప్పటిలాగే మౌనంగా ఉన్నారు. ప్రధాన మంత్రి జవాబు చెప్పాల్సిందే. అన్నీ తెలిసినప్పటికీ, వందలాదిమంది కుమార్తెలను లైంగికంగా వేధించిన రాక్షసుడి కోసం ఆయన ఎందుకు ప్రచారం చేశారు? కేవలం ఓట్ల కోసమే! ఇలాంటి కేసులో అంత పెద్ద నేరస్థుడు దేశం నుంచి ఎలా పారిపోగలడు? అత్యాచారాలకు పాల్పడిన నేరస్థులకు ప్రధాని మౌనమద్దతు దేశవ్యాప్తంగా ఉన్న నేరస్థుల్లో ధైర్యం నింపుతోంది' అని రాహుల్ ఓ సోషల్ మీడియా పోస్టులో ఆక్షేపించారు.

స్కూళ్లలో బాంబుల అలజడి!

130 పాఠశాలలకు అజ్ఞాత ఈ మెయిళ్లు .. ఢిల్లీలో కలకలం.. వణికిపోయిన విద్యార్థులు, తల్లిదండ్రులు

» స్కూళ్ల వద్ద గందరగోళ పరిస్థితులు
» తనిఖీలు జరిపి ఏమీ లేదని తేల్చిన బాంబు స్క్వాడ్ బృందాలు
» రష్యా నుంచి ఈమెయిళ్లు..ఐఎస్ హస్తం?



ఢిల్లీలో ఓ పాఠశాల ఆవరణలో పిల్లలు

న్యూఢిల్లీ, మే 1: పాఠశాలల్లో బాంబులు పెట్టామనే బెదిరింపు ఈమెయిళ్లతో ఢిల్లీలో బుధవారం కలకలం చెలరేగింది. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై తీవ్ర ఆందోళనతో స్కూళ్లకు పరుగులు తీశారు. యాజమాన్యాలు స్కూళ్లను మూసివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించాయి. పోలీసు, భద్రతా దళాలు పాఠశాలల్లో తనిఖీలు జరిపి బాంబులు ఏమీ లేవని, బెదిరింపు ఈ మెయిళ్లు ఒట్టివేనని తేల్చారు. ఈ మెయిళ్లు ఎక్కడి నుంచి వచ్చాయన్నది అధికారికంగా వెల్లడి కాకపోయినా.. రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, అవన్నీ ఒకే విధంగా ఉన్నాయని ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీతో పాటు నగర పరిసరాల్లోని నోయిడా, గ్రేటర్ నోయిడాల్లో ఉన్న దాదాపు 130 స్కూళ్లకు బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. దీంతో స్కూళ్ల సిబ్బంది ఓవైపు తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూనే మరోవైపు పోలీసులకు, అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. పిల్లల్ని స్కూళ్లో దించి గంట కూడా కాకముందే.. 'ఎమర్జెన్సీ పరిస్థితి కారణంగా స్కూల్‌ను మూసేస్తున్నాం.. మీ పిల్లల్ని తీసుకెళ్లండి' అని పాఠశాలల నుంచి ఫోన్ రావటంతో తల్లిదండ్రులు ఆదరబాదరగా తరలివెళ్లారు. దీంతో అన్ని స్కూళ్ల వద్ద తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ఆకస్మిక పరిణామంతో విద్యార్థులు వణికిపోయారు. బెదిరింపు ఈమెయిళ్లు వచ్చిన అన్ని స్కూళ్లలో బాంబు తనిఖీ దళాలు క్షుణ్ణంగా సోదాలు జరిపాయి. ఎక్కడా ప్రమాదకరమైన వస్తువులు ఏవీ లేవని తేల్చారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ స్పందిస్తూ.. బాంబు బెదిరింపు ఒట్టిదేనని.. పోలీసులు, భద్రతా సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలెవరూ భయాందోళనలకు గురి కావద్దని ఒక ప్రకటన విడుదల చేసింది. పుకార్లను వ్యాపింపజేయటం కోసమే బెదిరింపు ఈమెయిళ్లను పంపించి ఉంటారని ఢిల్లీ అదనపు పోలీసు కమిషనర్ సీపీ మీనా పేర్కొన్నారు. కాగా, బెదిరింపు ఈ మెయిళ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను గుర్తించాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈమెయిళ్లు రష్యా నుంచి వచ్చినట్లు తెలుస్తోందని ఢిల్లీ పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. సావరిమ్ అనే అరబిక్ పదంతో కూడిన ఈమెయిల్ ఐడీ నుంచి మెయిళ్లు వచ్చాయని, సదరు మెయిల్ ఐడీని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదసంస్థ ఉపయోగిస్తుందని ఓ పోలీసు అధికారి తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్ స్క్వాడ్

బిహార్ రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు

బిహార్‌లోనూ బాంబు బెదిరింపు కలకలం రేపింది. రాజ్‌భవన్‌లో బాంబు అమర్చినట్లు మంగళవారం రాజ్‌భవన్ అధికారులకు, బిహార్ పోలీసులకు ఈ మెయిల్ వచ్చింది. వారు వెంటనే అప్రమత్తమై భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో రాజ్‌భవన్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని, అనుమానాస్పదంగా ఏమి కనిపించలేదని బుధవారం సీనియర్ పోలీసు అధికారి రాజీవ్ మిశ్రా తెలిపారు. దాన్ని ఆకతాయి చర్యగా తేల్చారు.

పెళ్లంటే పాటలు, డ్యాన్స్‌లు కాదు

» రిజిస్ట్రేషన్ రుజువు మాత్రమే.. చట్టబద్ధం కాదు: సుప్రీం కోర్టు


న్యూఢిల్లీ, మే 1: హిందూ వివాహం చెల్లుబాటు కావాలంటే సముచిత ఆచార వ్యవహారాల మధ్య వివాహ క్రతువు నిర్వహించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహాన్ని పవిత్ర మతపరమైన తంతుగా అభివర్ణించింది. సప్తపది (పవిత్ర అగ్నిగుండం చుట్టూ 7 అడుగులు) ప్రాధాన్యాన్ని ప్రస్తావించింది. భవిష్యత్తులో వచ్చే వివాదాల సమయంలో ఇటువంటివి రుజువుగానూ ఉంటాయని పేర్కొంది. అంతేకానీ ఆటపాటలు.. విందు భోజనాల కోసం నిర్వహించే కార్యక్రమం పెళ్లి కాదని జస్టిస్ బీవీ నాగరత్నం నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోని ఓ యువ జంట.. విడాకుల కోసం ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 'హిందూ వివాహం ఓ సంస్కారం.. పవిత్రమైన మతకర్మ. భారతీయ సమాజంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వివాహమంటే ఆటపాటలు, విందువినోదాలు, కట్నకానుకలు ఇచ్చిపుచ్చుకునే సందర్భమో.. వాణిజ్యపరమైన లావాదేవీనో అస్సలు కాదు. ఇది కుటుంబ వ్యవస్థకు ఓ గంభీరమైన పునాది కార్యక్రమం' అని వ్యాఖ్యానించింది. 'హిందూ వివాహ చట్టం-1955లోని సెక్షన్ 8 ప్రకారం వివాహాన్ని నమోదు చేయడం వల్ల రుజువు లభిస్తుంది. అయితే సెక్షన్ 7 మేరకు ఆచార సంప్రదాయాలతో వివాహం నిర్వహించకపోతే చట్టబద్ధత లభించదు' అని కోర్టు స్పష్టం చేసింది.

కొవిషీల్డ్‌పై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ టీకా వల్ల అరుదైన కేసుల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందంటూ.. దాన్ని తయారుచేసిన ఆస్ట్రాజెనెకా సంస్థే ఇటీవల ఒప్పుకొన్న నేపథ్యంలో.. సీనియర్ న్యాయవాది విశాల్ తివారీ బుధవారం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై వైద్య నిపుణుల బృందాన్ని నియమించేలా.. ఆ టీకా తీసుకున్న తర్వాత చనిపోయిన, వైకల్యానికి గురైనవారి కుటుంబాలకు నష్టపరిహారం అందించేందుకు వ్యాక్సిన్ డ్యామేజ్ పేమెంట్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని ఆ పిటిషన్‌లో ఆయన అభ్యర్థించారు. "దేశంలో 175 కోట్లకు పైగా డోసుల కొవిషీల్డ్ టీకాలు ప్రజలకు వేశారు. ఇటీవల యువకులు కూడా గుండెపోటుతో మరణిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి" అని విశాల్ తివారీ తన పిటిషన్‌లో గుర్తు చేశారు.

సల్మాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటనలో.. కస్టడీలోని నిందితుడి ఆత్మహత్య

ముంబై, మే 1: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద ఇటీవలే కాల్పులకు పాల్పడిన ఘటనలో పలువురిని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు అనూజ్ తపన్(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టాయిలెట్‌లోని కిటికీకి బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ముంబైలోని సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద గత నెల 14న కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులకు ఆయుధాలను సరఫరా చేసిన కారణంగా తపన్‌ను అరెస్టు చేశారు.



అయోధ్యలో కొలువుదీరిన బాలరాముడిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆమె అయోధ్యలోనే హనుమాన్ గఢీ ఆలయంలో హనుమంతున్ని దర్శించుకొని పూజలు చేశారు.

ఉగ్రవాది గోల్డీ బ్రార్ హత్య

» కాలిఫోర్నియాలో కాల్చి చంపిన దుండగులు



వాషింగ్టన్, మే 1: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యకేసులో కీలక నిందితుడు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్రవాది గోల్డీ బ్రార్(30) అమెరికాలో హత్యకు గురయ్యాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం కాలిఫోర్నియాలోని ఫెయిర్ మాంట్‌లో ఉన్న హోల్ట్ అవెన్యూలో ఓ ఇంటి ముందు తన స్నేహితుడితో కలిసి నిలబడ్డ గోల్డీ బ్రార్‌పై గుర్తుతెలియని దుండగులు తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన గోల్డీ బ్రార్, అతని స్నేహితుడిని సమీప ఆస్పత్రికి తరలించారు. గోల్డీ బ్రార్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. గోల్డీ బ్రార్ హత్యకు తమదే బాధ్యత అని ఆయన ప్రత్యర్థులు ఆర్ష్ దల్లా, లఖ్బీర్ ప్రకటించారు. గోల్డీబ్రార్ స్వస్థలం పంజాబ్‌లోని శ్రీముక్త్‌సర్ సాహిబ్. 1994లో జన్మించారు. తన సోదరుడు గురులాల్ బ్రార్‌ను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువజన కాంగ్రెస్ నేత గురులాల్ పహిల్వాన్‌ను 2021 ఫిబ్రవరి 8న హతమార్చాడు. ఆ తర్వాత విద్యార్థి వీసాపై కెనెడాకు పారిపోయాడు. 2021 ఆగస్టులో మొహాలీలో గోల్డీ మరో సోదరుడు విక్కీ మిద్దూఖేరా(గ్యాంగ్‌స్టర్) హత్యకు గురయ్యాడు. ఆ కేసులో గాయకుడు సిద్ధూ మూసేవాలా మేనేజర్ షాగన్ ప్రీత్‌సింగ్ ప్రధాన నిందితుడు. దీంతో గోల్డీ బ్రార్ కెనడా నుంచి మూసేవాలా హత్యకు స్కెచ్ వేశాడు. 2022 మే 29న మూసేవాలాను హతమార్చాడు.

'అబూజ్‌మడ్' మృతుల్లో ముగ్గురు తెలుగువారు

చర్ల, మే 1: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మంది మావోయిస్టుల్లో 8 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో ముగ్గురు తెలుగువారు ఉన్నారు. 10 మంది మావోయిస్టులపై మొత్తం రివార్డు విలువ రూ.63 లక్షలుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కరీంనగర్ జిల్లా రామగుండానికి చెందిన జోగయ్య అలియాస్ చీమల నర్సయ్య(66) ఉన్నారు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు. మిగతా మృతుల్లో.. ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు చెందిన డీవీసీఎం సభ్యుడు వినయ్ అలియాస్ రవి(55), వరంగల్ జిల్లాకు చెందిన సుస్మిత అలియాస్ చైతే ఉన్నట్లు వివరించారు. వినయ్‌పై రూ.8లక్షలు, సుస్మితపై రూ.2 లక్షల మేర రివార్డు ఉన్నట్లు తెలిపారు.

ఉక్రెయిన్‌లో హ్యారీ పోటర్ కోట ధ్వంసం

» క్షిపణులతో రష్యా దాడి.. ఐదుగురి మృతి




కీవ్, మే 1: ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంలో నల్లసముద్ర తీరం వెంబడి ఉన్న ఓ అందమైన కట్టడం, స్థానికంగా హ్యారీపోటర్ కోటగా ప్రసిద్ధికెక్కిన భవనాన్ని రష్యా క్షిపణిదాడులు జరిపి ధ్వంసం చేసింది. ఈ దాడిలో భవనంలో ఉన్న ఐదుగురు చనిపోయారు. 32మంది గాయపడ్డారు. ప్రైవేటు న్యాయసేవా సంస్థ తమ కార్యకలాపాల కోసం ఈ భవనాన్ని ఉపయోగించుకుంటోందని, అదొక విద్యాసంస్థ అని పలు వార్తా సంస్థలు వెల్లడించాయి. బుధవారం రష్యా ఒడెసా నగరంపై క్షిపణులతో విరుచుకుపడింది. దాడిలో 20కి పైగా భవనాలు ధ్వంసం అయ్యాయి. ఈ దాడుల్లో రష్యా ఇస్కాండర్ బాలిస్టిక్ మిసైల్, క్లస్టర్ బాంబులను వాడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, క్రిమియాలోని తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఉక్రెయిన్ క్షిపణులను కూల్చిందని రష్యా ప్రకటించింది.

కాలిఫోర్నియా వర్సిటీలో 'జై శ్రీరామ్' నినాదాలు

న్యూయార్క్, మే 1: అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ నుంచి పాలస్తీనాకు అనుకూలంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. మరోవైపు లాస్ ఏంజెలిస్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల, వ్యతిరేక విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగింది. ముష్టిఘాతాలు, కుర్చీలు, కర్రలతో కొట్టుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఘర్షణ సందర్భంగా ఇజ్రాయిల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన వీడియో వైరల్‌గా మారింది. పాలస్తీనా అనుకూల విద్యార్థి ఒకరు భారత వ్యతిరేక నినాదాలు చేయడంతో, దానికి కౌంటర్‌గా ఇజ్రాయిల్ అనుకూల విద్యార్థి 'జై శ్రీరామ్' నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ జెండాను కప్పుకొన్న ఆ విద్యార్థి పేరు శయన్ ఆలి కృష్ణ. పాకిస్థాన్‌లో జన్మించారు. కాగా, అమెరికా వ్యాప్తంగా ఇతర యూనివర్సిటీల్లో బుధవారం కూడా పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అరెస్టయిన విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు

గురువారం 2 మే 2024





గుంటూరు ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు అభ్యర్థి నసీర్, పశ్చిమ అభ్యర్థి మాధవి



గుంటూరులో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జన సందోహం

జన ప్రవాహం

- రోడ్ షోకు పోటెత్తిన జనం
- జైత్రయాత్రలా చంద్రబాబు ప్రజాగళం
- సైకో రాకుంటే.. గుంటూరు అద్భుతంగా ఉండేది
- అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి అభివృద్ధి
- గుంటూరు ప్రజాగళం సభలో చంద్రబాబు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న డిప్యూటీ మేయర్ సజీలా, షాకత్



మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానితో మాట్లాడుతూ..

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఐదు కిలోమీటర్ల దూరం.. రెండున్నర గంటల సమయం. ప్రజాగళానికి జనసునామీ పోటెత్తింది. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ శ్రేణులకు తోడుగా వేలాది మంది ప్రజలు, మహిళలు, యువకులు తరలి రాగా.. కూటమి జెండాల రెపరెపల మధ్య.. తరలివచ్చిన అశేష జన వాహిని జయజయ ధ్వానాల మధ్య ప్రజాగళం రోడ్ షో జరిగింది. బుధవారం రాత్రి ఇన్నర్ రింగురోడ్డులోని శ్రీ కన్వెన్షన్ వద్ద మొదలైన చంద్రబాబు రోడ్ షో జన ప్రవాహంలా నగర వీధుల్లో సాగింది. దారిపొడవునా వేలాదిమంది ప్రజలను దాటుకుని ముందుకు సాగడానికి వీలు కాని పరిస్థితి ఏర్పడింది. చంద్రమౌళినగర్, నవభారత్‌నగర్, విద్యానగర్‌ల మీదగా కొరిటెపాటు వరకు అడుగడుగునా జననీరాజనాలతో రోడ్ షో నిదానంగా సాగింది. లాడ్జిసెంటర్ నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకూ రోడ్డుకు ఇరువైపులా వేలాదిగా తరలివచ్చిన వారు డివైడర్‌పై నించుని చంద్రబాబుకు అభివాదం చేశారు. శంకర్‌విలాస్ సెంటర్‌లో జనసాగరాన్ని చూసిన గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మ సాని చంద్రశేఖర్ 'చూశావా జగన్.. గుం టూరు కారం.. పసుపు మమకారం చూశావా జగన్' అంటూ నినాదాలు చేశారు. రోడ్ షోలో పెమ్మసాని, పశ్చిమ, తూర్పు అభ్యర్థులు గళ్లా మాధవి, నసీర్ చంద్రబాబు వాహనానికి ఇరువైపులా నిలుచుని ముందుకు సాగారు. అనంతరం జిన్నా టవర్ సెంటర్లో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగిం చారు. రాజధాని అమరావతిని సైకో ముఖ్య మంత్రి ధ్వంసం చేసి గుంటూరు అభివృద్ధిని విధ్వంసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. సైకో జగన్ అధికారంలోకి రాకుండా ఉంటే అమరావతి, గుంటూరు అభివృద్ధి అద్భుతంగా ఉండేదన్నారు. హైదరాబాద్‌లో 163 కి.మీ రింగురోడ్డు వేసిన తాను ఆ రికార్డును బద్ధలు కొట్టి 185 కి.మీ ఔటర్ రింగు రోడ్డు వేయ డానికి పూనుకున్నానని చెప్పారు. ఆ రోడ్డు వచ్చి ఉంటే ఇటు గుంటూరు, అటు చిలకలూ రిపేట, ఇంకోవైపు హనుమాన్‌జంక్షన్ వరకూ నలుదిక్కులా అభివృద్ధి జరిగి ఉండేదని, కానీ ఆ కలలన్నీ దుర్మార్గుడు విధ్వంసం చేశా డన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెం టనే అమరావతిని, గుంటూరును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

గుట్కా వ్యాపారి ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరులో గుట్కా వ్యాపారం, గంజాయి సరఫరా చేసే వ్యక్తి వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా. సిగరెట్ తయారీ లోనూ గంజాయి కూర్చు తున్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు కొట్టేస్తున్నాడు. మంగళగిరి రోడ్డులో 8 ఎకరాలు, రెడ్డి పాలెంలో 35 ఎకరాలకు టెండర్ పెట్టాడు. ముస్లిం కాలేజ్ వద్ద కూడా వక్ఫ్ ఆస్తులు కబ్జా చేశాడు. టీడీపీకి అండగా ఉన్నాడని ముస్తఫా ఇంట్లో పనిమనిషిని కూడా నానా రకాలు వేధించి చిత్ర హింసలకు గురి చేశాడు. అలాంటి రోజే ఏదో ఒక రోజు ముస్తఫాకు వస్తుందని, అది గుర్తు పెట్టుకోవాలి. టీడీపీ అధి కారంలోకి రాగానే వక్ఫ్ బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకుంటాం. వైసీపీ వాళ్ల మక్కెలు విరగ్గొడతా.

రోషం రావాలి

మీకు అమరావతి రాజధాని కావాలంటే మీలో రోషం.. కోపం రావాలి. అవి ఉంటే ఈ వైసీపీ వాళ్లు తిరగగలుగుతారా. వాళ్లు వస్తే ముందు అమరావతికి జై కొట్టి ఆ తర్వాత ఓట్లు అడగమనండి. మూడు రాజధానుల పేరుతో మీ పొట్టలు కొట్టి మిమ్మల్ని ఓటు అడిగే హక్కు ఎక్కడిదన్నారు. విశాఖ ప్రజలు వద్దంటున్నా జగన్ రాజధానిని అక్కడికి తీసుకెళతానంటున్నాడు. ఇదేనా జగన్ మీకు ఇచ్చే గౌరవం.



గుంటూరులో చంద్రబాబు రోడ్ షోకు హాజరైన జనం



మహిళల కేరింతలు





దారి పొడవునా అభిమానమే..



మై విజన్ తాడికొండ

మై విజన్ తాడికొండ నియోజకవర్గం అనే డ్యాకుమెంట్‌ను తయారు చేస్తున్నా. నిపుణులైన అధికారులతో టీమ్‌ను ఏర్పాటు చేశాను. రాబోయే ఐదేళ్లలో తాడికొండ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయి.. నేను ఏమి చేయాలనుకుంటున్నాను.. ప్రభుత్వం ద్వారా ఏమి చేయిస్తాను.. ఎన్‌జీవో, ఇతర సంస్థల సహాయం తీసుకుని ఏవిధంగా అభివృద్ధి చేస్తానో.. తాడికొండ విజన్ డ్యాకుమెంట్‌లో ఉంటుంది. యువతకు ఉద్యోగ కల్పన కోసం ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తా. అలాగే మెరుగైన వైద్య సేవల కోసం ఎమ్మెల్యే కార్యాలయంలో ఓ సెల్‌ను ఏర్పాటు చేస్తా. ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి ఏడాదిలో ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు అందించేలా కృషి చేస్తాను. రాజధాని నియోజకవర్గం కాబట్టి రోడ్ల కనెక్టవిటీ పెంచేందుకు బ్రహ్మాండమైన రోడ్లు వేస్తాం. ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం ప్రాధాన్యంగా తీసుకుంటాను.

అభివృద్ధే అజెండా

- నియోజకవర్గ రూపురేఖలు మార్చుతా
- తాగు, సాగు నీరు అందిస్తా
- 15 ఏళ్లుగా ప్రజలతో మమేకం.. వారి రుణం తీర్చుకుంటా
- ఆంధ్రజ్యోతితో తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, మే 1: ప్రభుత్వ ఉద్యోగిని. ప్రజలకు ఎక్కువగా సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చాను. అభివృద్ధే నా అజెండా. పదిహేనేళ్ల నుంచి ప్రజలతో మమేకమయ్యాను. ఏ గ్రామానికి వెళ్లినా సొంత కుటుంబ సభ్యుడిగా అక్కున చేర్చుకుంటున్నారు. వారి రుణం తీర్చుకుంటాను.. అని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. తాడికొండ నియోజకవర్గం నుంచి నాల్గో సారి శ్రావణ్‌కుమార్ బరిలో నిలిచారు. ప్రచారంలో దూసుకెళ్తున్న శ్రావణ్‌కుమార్ వివిధ అంశాలపై ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అణచివేత నుంచి బయటకు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు అణచివేతకు గురయ్యారు. ఇప్పుడే వారంతా బయట పడుతున్నారు. స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. ప్రచారంలో అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది. యువతలో అద్భుతమైన స్పందన కనిపిస్తుంది.

ప్రజలు ప్రస్తావిస్తున్న సమస్యలు

నియోజకవర్గంలో నీటి సమస్య ఉంది. గతంలో ఏర్పాటు చేసిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను కొనసాగించలేదు. నీటి పారుదలశాఖ మంత్రి ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తి అయినా చెరువులు నింపుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించలేదు. దీంతో తాగునీరు, సాగునీటి ఎద్దడి వచ్చి నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ సర్పంచ్‌లు చెరువుల్లో మట్టిని అమ్మేసుకున్నారు. ప్రజలకు తాగునీరు ఇద్దామనే ఆలోచన లేదు.

స్థానిక ప్రజాప్రతినిధులపై ఆరోపణలు

మాజీ హోంమంత్రి, ప్రస్తుత వైసీపీ అభ్యర్థి మేకతోటి సుచరితపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల స్థలాలు, భూగర్భ వనరులకు సంబంధించి ఓ మహిళ ఢిల్లీ వరకు వెళ్లి వేలుకోసుకునే పరిస్థితి వచ్చిందంటే సుచరిత, ఆమె అనుచరుల దుర్మార్గాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలి.

వైసీపీది దందాల పాలన

వైసీపీది చేతకాని పరిపాలన. రాజధాని లేకుండా చేశారు. అధికార పార్టీ అరాచకాలు చాలా ఉన్నాయి. లాంలో దాడులు, గ్రావెల్, మట్టి విక్రయాలు, జగన్ కాలనీల్లో దందాలు, రాజధానిలో మట్టి, ఇసుక, కంకర, ఇనుము దొంగతనాలు ఇలా చెప్పుకుంటు పోతే చాలానే ఉన్నాయి.

రోడ్లు అధ్వానం

నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఐదేళ్లుగా ఎక్కడా రోడ్లు వేసిన పాపాన పోలేదు. గతంలో లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రోడ్లు వేయాలని నిర్ణయించగా ఆ ప్రాజెక్టును జగన్ పక్కన పెట్టేశారు.

ప్రచారంలో పూల వర్షం

ఎన్నికల ప్రచారంలో భాగంగా వెళ్లే ప్రతీ గ్రామంలోనూ స్పందన అద్భుతంగా ఉంది. ప్రజలు పూలవర్షాలతో స్వాగతం పలుకుతున్నారు. మహిళలు హారతులతో ఆశీర్వదిస్తున్నారు. ఆర్భాటాలు, పూల వర్షాలు తగ్గించాలని చెప్తున్నా స్వచ్ఛందంగా వస్తున్నారు. మహిళల నుంచి వృద్ధుల వరకు ప్రచారంలో మమేకమై పాల్గొంటున్నారు.

చంద్రబాబు వస్తేనే ఎస్సీ వర్గీకరణ

● మాదిగల ఆత్మీయ సమావేశంలో మందా కృష్ణమాదిగ

● పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని

దాచేపల్లి, మే1: మా జాతిని గెలిపించుకునే తపన తప్ప నాకు మరో ధ్యాసలేదు. నా జాతి వర్గీకరణతోనే అభివృద్ధిని సాధిస్తుంది.. మీ బిడ్డను, మీ అన్నను 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. అక్కడ ప్రధాని మోదీ మనకు హామీ ఇచ్చాడు.. ఇక్కడ చంద్రబాబు మనకు అండగా వున్నాడు.. చంద్రబాబు వస్తేనే వర్గీకరణకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఉద్ఘాటించారు. బుధవారం దాచేపల్లిలోని ఎస్సీ కాలనీలో మాదిగల ఆత్మీయ సమావేశాన్ని గురజాల నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మందా కృష్ణ మాదిగతో పాటు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు హాజరై ప్రసంగించారు.

మందా కృష్ణమాదిగ మాట్లాడుతూ 'నాకు గతంలో వైఎస్సార్, చంద్రబాబునాయుడులు పదవులిస్తామన్నారు. నా జాతి అభివృద్ధే నాకు ముఖ్యమన్న లక్ష్యంతోనే పదవులను తీసుకోలేదు. ఏబీసీడీ వర్గీకరణ చేయాలి, నా జాతి మొత్తం బాగు పడాలని పోరాటం చేస్తున్నాను'అని కృష్ణమాదిగ అన్నారు. నాడు చంద్రబాబునాయుడు సీఎంగా వున్నప్పుడు 22వేల మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మాదిగలకు నమ్మక ద్రోహం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ పెట్టారు.. ఒక్క రూపాయి నిధులు కూడా లేవు. ఈ ఐదు సంవత్సరాల్లో మనల్ని రాజకీయంగా ఎదగనీయకుండా చేశారు. మాదిగలకు నమ్మక ద్రోహం చేసిన వ్యక్తి సీఎం జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మా అన్న యరపతినేని శ్రీనివాసరావు, మా తమ్ముడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాల్సిన అవసరముందని కృష్ణమాదిగ అన్నారు.

12 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తాం : ఎంపీ అభ్యర్థి లావు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 12 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాదిగల ఆత్మీయ సమావేశంలో వివరించారు.



మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు వేదికపై మందకృష్ణమాదిగ, యరపతినేని

నరసరావుపేటలో బాబు జగజ్జీవన్‌రావ్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పార్లమెంట్ పరిధిలో 50 కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చుచేస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అర్హత కలిగిన వారికి రుణాలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటుచేశారు కానీ చైర్మన్‌కు అధికారం లేదు.. గౌరవం లేదు. దళితులకు సంబంధించిన 25 స్కీమ్‌లను రద్దుచేశారు. వాటిని పునఃప్రారంభిస్తామని వివరించారు.

మాదిగల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా : యరపతినేని

మాదిగల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తానని, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగతో గత 30 సంవత్సరాలుగా మాకు అన్నదమ్ముల్లా అనుబంధం వుందని యరపతినేని తెలిపారు. ఏ సమస్య వచ్చినా నేనున్నానని, మాదిగలను అన్నివిధాల ఆదుకుంటానని, కమ్యూనిటీ భవనాలు కావాలన్నా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందించాలన్నా మీకెప్పటికీ అందుబాటులో వుంటానని యరపతినేని తెలిపారు. గురజాల నియోజకవర్గ పరిధిలోవున్న వేలాది మంది మాదిగలంతా సభా ప్రాంగణానికి చేరుకోవడంతో దాచేపల్లిలోని రహదారి అంతా మాదిగ సోదరులతో నిండిపోయింది. సమావేశంలో డాక్టర్లు కర్నాటి వరలక్ష్మీ, వున్నం నాగమల్లికార్జునరావు, జనసేన నేతలు కటకం అంకారావు, మాతంగి సత్యానందం చిలుముల దుర్గారావు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

పేదరికం లేని ముస్లిం సమాజ స్థాపనే లక్ష్యం

● శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్



ప్రచారంలో మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, పక్కన ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే1: రాష్ట్రంలో పేదరికం లేని ముస్లిం, మైనార్టీ సమాజాన్ని సాధించటటమే చంద్రబాబు, పవన్ కల్యాన్‌ల లక్ష్యమని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. పట్టణంలోని గుర్రాలచావిడి నుంచి తూర్పు మాలపల్లె మీదుగా రహమత్ నగర్, మద్దినగర్, సుభానీ నగర్‌లలో ఎన్నికల ప్రచారం, రోడ్ షో నిర్వహించారు. వాటితో పాటు కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కూడా పాల్గొన్నారు. అనం తరం షరీఫ్ మాట్లాడుతూ టీడీపీ స్థాపించిన దగ్గర నుంచి తాను ఇక్కడే ఉన్నానంటే కారణం పార్టీ లౌకిక విధానాలు, మత సామరస్యానికి చేస్తున్న కృషే అన్నారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత 2600 కోట్ల బడ్జెట్ ముస్లింలకు కేటాయించి ముస్లింల పేదరికాన్ని దూరం చేయటా నికి 45వేల మందికి లక్ష రాయితీపై రూ.5 లక్షలు ఆర్థికసాయం చేశారన్నారు. ఇలాంటి విధానం వైసీపీ ప్రభుత్వంలో ఉందా? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయిన తరువాత ఒక ముస్లింకైనా రుణం ఇచ్చారా?, ఇస్లామిక్ బ్యాంక్ అన్నారు, గాలికి వదిలి వేశారు. దుల్హన్ పథకాన్ని నిర్వీర్యం చేశారు అని అన్నారు.. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతు టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు గురించి కొంతమంది దుష్ప్ర చారంచేస్తున్నారని, రాష్ట్ర పునఃర్నిర్మాణం, అభివృద్ధి ముస్లింలను పేదరికం కష్టాల నుంచి దూరం చేయటమే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల లక్ష్యమన్నారు. ఎన్‌ఆర్‌సీ, సీఏఏకి చట్టబద్ధత బిల్లులకు ఎందుకు మద్దతు ఇచ్చారో వైసీపీ నాయకులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న భాష్యం ప్రవీణ్

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● మృతదేహాలను సందర్శించి నివాళులర్పించిన భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 1: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన మండలంలోని రామాపురంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. గొడ్డుగొర్ల కిషోర్, బుజ్జి దంపతుల రెండవ కుమారుడు అబీ, గొడ్డు గొర్ల నాగేశ్వరరావు, మరియమ్మ దంపతుల ఒక్కగాని ఒక్క కుమారుడు మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్లారు. రాత్రి 8:30 గంటలైనా ఇంటికి రాక పోవటంతో గాలించగా అనుమానం వచ్చి చెరువుగట్టుకు వెళ్లారు. సందీప్ చెప్పులు చెరువుగట్టుపై ఉండటంతో ప్రమాద వశాత్తు చెరువులోపడి మృతిచెంది ఉంటారని చెరువులోకి దిగి గాలిం చారు. ఇద్దరి చిన్నారుల మృతదేహాలు లభ్యమ య్యాయి. చిన్నారుల మృతదేహాలను కాలనీలోని వారి గృహాలకు తీసుకు వెళ్ళారు. సందీప్ కుటుంబంలో ముగ్గురు ఆడ పిల్లలు కాగా సందీప్ ఒకే ఒక్క కుమారుడు. మృతిచెందిన ఇద్దరు 7వ తరగతి చదువుతు న్నారు. వేసవి కాలం కావటంతో చెరువు వైపు వెళ్ళి ప్రమాద వశాత్తుచెరువులో పడి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆయా గ్రామానికి వెళ్లి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. అనంతరం బాలుర మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

పట్టుకున్నది ఒకరిని.. కేసు మరొకరిపై !

● వైసీపీ నాయకుల ఒత్తిడితో సంబంధం లేని వ్యక్తిపై కేసు

మాచవరం, మే 1: ఎన్నికల నిబంధనలను అధికారులు తుంగలో తొక్కి వారే అక్రమార్కులకు దారిచూపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలైన దొంగ చిక్కినప్పటికీ వైసీపీ నాయకుల ఒత్తిడితో అతనిని వదిలేసి సంబంధం లేని వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెబుతున్న సెబ్ అధికారుల వైఖరిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మాచవరం ప్రభుత్వ మద్యం దుకాణంలో 20 మద్యం సీసాలు తీసుకొని వెళ్తున్న మాచవరం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇకరిని సెబ్ పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అంతలోనే వైసీపీ నాయకుల ఫోన్‌లో ఒత్తిడి తీసుకురావడంతో పట్టుకున్న వ్యక్తిని వదిలేసి వేరొక వ్యక్తిపై కేసు నమోదుచేశారు. ఈ విషయంపై విలేకరులు మాచవరం పోలీసులు, సెబ్ అధికారులను సంప్రదించేందుకు ఎంత ప్రయత్నించినా ఫోన్‌లు మాత్రం ఎత్తలేదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మద్యం తరలిస్తూ కిందపడి గాయాలైన వ్యక్తిని వదిలేసి మరొకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సెబ్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలపడం విడ్డూరంగా వుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాచవరం గ్రామానికి చెందిన ఏసుపొంగు రామారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. ఈ సంఘటనపై దేశం పార్టీ శ్రేణులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



గారపాడులో గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్

పెదకూరపాడు, మే1: ఎన్నికల నియమావళిని ఉల్లంఘన జరిగినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పల్నాడుజిల్లా ఎస్పీ బీ.బిందుమాధవ్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన గారపాడు గ్రామాన్ని బుధ వారం ఆయన సందర్శించారు. ఆ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక సాధారణ అనేవిధంగా పోలింగ్ కేంద్రాలను విభజించామని, ఇందుకు తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ఓటు హక్కు విలువల గురించి వివరించారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ఎస్ఐ వెంకటరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

3న క్రోసూరులో సీఎం జగన్ పర్యటన

క్రోసూరు: ఈనెల 3న సీఎం జగన్ క్రోసూరులో పర్యటించనున్నట్టు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటు, సభా స్థలం మొదలైన వాటిని పరిశీలించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ జీ.గురునాథబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, సీఐ మంగారావు, క్రోసూరు ఎస్ఐ ఉన్నారు.

కూటమి మేనిఫెస్టోతో

అన్నివర్గాల ప్రజలకు మేలు

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని



కూటమి మేనిఫెస్టోపై మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే1: టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో అన్నివర్గాలకు మేలు కలిగించేలా వుందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పాటు మహిళకు వందనం, రైతుకు ప్రతి ఏడాది రూ.20 వేలు పెట్టుబడి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీతోపాటు అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, ఉచిత ఇసుకతో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకు తుందన్నారు. ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛన్‌ను ఇంటివద్దనే అందించేలా మేనిఫెస్టోలో ప్రకటించడం పింఛన్ దారుల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక లతో పాటు ఆర్యవైశ్య సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు, కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పన దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా చేపడతామని యరపతినేని తెలిపారు. రూ.10లక్షలు విలువ చేసే చంద్రన్న బీమా ప్రీమియం రుసుంను గురజాల నియోజక వర్గంలో లక్షన్నర మందికి స్వయంగా తానే చెల్లించడం జరుగుతుందని యరపతినేని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేలా కూటమి మేనిఫెస్టో ఉందని యరప తినేని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

ఈపూరివారిపాలెంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

● గ్రామంలో వైసీపీ కవ్వింపు చర్యలు

చిలకలూరిపేట, మే1: చిలకలూరిపేట మండలం ఈపూరివారి పాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామంలో సీతారామాంజనేయ స్వామి గుడి వద్ద గ్రామస్తులు వార్షికోత్సవం నిర్వహించుకున్నారు. అనంతరం గ్రామ వీధుల్లో భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. పైగా అదే రోజు గ్రామానికి చెందిన 50 ఎస్టీ కుటుంబాల వారు వైసీపీలో నుంచి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో రాత్రి 10.30 గంటల సమయంలో చిలకలూరిపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి కావటి మనోహర నాయుడు ఆ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్ళారు. బాణాసంచా కాలుస్తూ అనుచరులతో కలసి ఆయన గ్రామంలో ముందుకు సాగారు. అయితే గ్రామానికి చెందిన కొందరు సమయం ముగిశాక ఎన్నికల ప్రచారం చేయటం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. అయినా వైసీపీ వర్గీయులు వెనక్కి తగ్గలేదు. గ్రామ యువకులు తమ ప్రచారానికి అభ్యంతరం చెప్పటంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. కావటి సహా ఆయన అనుచరులు కొద్ది సేపు అక్కడ బైఠాయించారు అనంతరం చిలకలూరిపేట రూరల్ పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కన్పించలేదు. తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో చిలకలూరిపేట రూరల్‌పోలీసు స్టేషన్‌కు వచ్చి ఈఘటనపై ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఈపూరివారిపాలెం గ్రామానికి వెళ్ళి గ్రామస్తులకు భరోసా ఇచ్చి వచ్చారు. ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, ఇటువంటి కుట్రలకు వైసీపీ వారు తల పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి ఈపూరివారిపాలెం గ్రామం కంచుకోటగా ఉన్నది. దీనికి తోడు వైసీపీలో మిగిలి ఉన్న 50 ఎస్టీ కుటుంబాలు కూడా టీడీపీలో చేరటంతో వైసీపీ నాయకులకు మింగుడు పడలేదు. ఈ సంఘటనలో వైసీపీ వర్గీయులు తమ పై రాళ్ళు వేసి బీభత్సం సృష్టించారని టీడీపీ వర్గీయులు తెలిపారు. ఈ రాళ్ళ దాడిలో కొల్లూరి సుబ్బారావు(50) అనే వ్యక్తి గాయ పడ్డారని కూడా గ్రామస్తులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై ప్రత్తిపాటి పుల్లారావు నరసరావుపేట డీఎస్పీ వర్మతో మాట్లాడారు. ఆయన చిలకలూరిపేటకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. కాగా ఈపూరివారి పాలెంలో జరిగిన సంఘటన నేపథ్యంలో బాధ్యులైన ఇరు వర్గాలకు చెందిన కొందరిపై బైండోవర్ కేసులు పెట్టబోతున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఈపూరివారిపాలెంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబందించి చిలకలూరిపేట రూరల్ పోలీసు కేసు నమోదైంది.

అప్పులబాధ తాళలేక

కౌలు రైతు ఆత్మహత్య



గుర్రం చిన కోటయ్య (ఫైల్)

బొల్లాపల్లి, మే1: మండలంలోని పేరూరుపాడు గ్రామానికి చెందిన గుర్రం చినకోటయ్య(42) అప్పుల బాధ తాట్టుకోలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధ వారం బొల్లాపల్లి ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోటయ్య 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని 2 ఎకరాల్లో మిర్చి, 3 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంటలు సరిగా పండక ఆసించిన దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయి సుమారు రూ.6 లక్షలు అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పుల బాధ తట్టుకోలేక ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కోటయ్య మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు.

కూటమి విజయానికి మేనిఫెస్టో సోపానం

● పల్నాడు జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షుడు బ్రహ్మం గౌడ్

రెంటచింతల, మే 1: కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పిస్తాననడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నేత, పల్నాడు జిల్లా కల్లుగీత కార్మిక సంఘ అధ్యక్షులు పోలగాని బ్రహ్మం గౌడ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ జనసేన బీజేపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో బడుగులకు ఎంతో మేలు చేసేదిగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గౌడ వర్గీయలు సంక్షేమానికి చేసిన కృషిని మరువ లేమని అన్నారు. అమరావతి పునర్నిర్మాణం, సాగునీటి రంగం, పారిశ్రామిక పెట్టుబడులు,ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, చంద్రన్న బీమా, కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు ఆయా వర్గాలకు మేలు చేస్తాయన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు.

సవతి తల్లిని హతమార్చిన కొడుకు

● కాళ్లకు విద్యుత్ షాక్ ఇచ్చి.. ఆపై హత్య

దాచేపల్లి, మే 1: ఇల్లు తనపేరున రాయలేదని సవతి తల్లి కాళ్లకు విద్యుత్ షాక్ ఇచ్చి ఆపై గడ్డపారతో తలపై మోది హత్యచేసిన ఘటన బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడు పంచాయతీ శివారు శంకరాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన బాణావత్ లక్ష్మీబాయి (45) అదే గ్రామానికి చెందిన దత్తునాయక్‌ను దత్తత తీసుకుంది. గత నాలుగు రోజుల నుంచి దత్తునాయక్ లక్ష్మీబాయి నివాసం వుంటున్న ఇంటిని తనపేర రాయాలని పలురకాలుగా వేదిస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ స్తంభం నుంచి వైర్లకు లైన్ కలిపి నేరుగా ఆమె కాళ్లకు తగిలించాడు. ఆ తరువాత పక్కనే వున్న గడ్డపలుగుతో ఆమె తలపై మోది హత్య చేశాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తనంతట తానుగా వచ్చి లొంగిపోయాడు. లక్ష్మీబాయి భర్త బాణావత్ హరినాయక్ గత రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రచార రథంపై ఫీల్డ్ అసిస్టెంట్ మాలపాటి బాబు

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

వికొండటౌన్, మే 1: వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మార్చి 19న మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారి ప్రచారాల్లో గోనుగుంట్ల వారిపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బాలు పాల్గొనడాన్ని టీడీపీ నేతలు గుర్తించి ఆర్వోకు ఫిర్యాదు చేశారు. అలాగు ఉప్పరపాలెంలో కిషోర్ కుమార్, దొండపాడు ఫీల్డ్ అసిస్టెంట్ కొండలు ప్రచారంలో పాల్గొనడంతో వారికి నోటీసులు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తాడేపల్లి టౌన్, మే 1: ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురం ఎయిమ్స్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం వెలవపేట గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకటేష్‌నాయుడు పెద్ద కుమారుడు గౌతమ్‌నాయుడు(12) అక్కడి వేసవి సెలవులకు తాడేపల్లి పరిధి కొలనుకొండలోని తాతయ్య కృష్ణారావు ఇంటికి వచ్చాడు. ఉదయం పాల ప్యాకెట్లు తీసుకురమ్మని బాలుడికి ద్విచక్ర వాహనం ఇచ్చి బైపాస్ రోడ్డులోని పాలబూతుకు పంపించారు. ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి వెంట వున్న ఎయిమ్స్ హాస్పిటల్ రోడ్డులోకి బాలుడు వచ్చాడు. ఈ క్రమంలో ఎదురుగా వెళుతున్న క్రేన్‌ను దాటుతూ అదుపుతప్పి క్రేన్ కిందపడడంతో అక్కడికక్కడే బాలుడు గౌతమ్ మృతిచెందాడు. ఈ ప్రమాద సంఘటనపై బాలుడి తండ్రి రామిశెట్టి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

అమరాతికి ద్రోహం చేసిన వైసీపీకి ఓటు వెయ్యొద్దు

● 1597వ రోజుకు చేరుకున్న నిరసనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే1: రాజధాని అమరావతిని నాశనం చేసిన వైసీపీకి ఓట్లు వేయవద్దు అని 33 వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు విన్నవించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతులు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్నఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1597వ రోజుకు చేరకున్నాయి.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజా రాజధాని కోసమని అమరావతికి భూములిస్తే, సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. రాజధానిని విచ్ఛిన్నం చేసిన జగన్‌ను ఓడించాలని, అమరావతి నిర్మాత చంద్రబాబును సీఎం చేద్దామని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

టీడీపీలో చేరిన 41వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ స్మిత పద్మజ

● కార్యకర్తలతో కలిసి చంద్రబాబు సమక్షంలో చేరిక


స్మిత పద్మజకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

గుంటూరు(తూర్పు), మే 1 : నగరపాలకసంస్థ పరిధిలో 41వ డివిజన్ కార్పొరే టర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ, వారి అనుచరులు భారీ సంఖ్యలో నియోజకవర్గ ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో, ఎలక్షన్ కోఆర్డినేటర్ తాడిశెట్టి మురళి నేతృత్వంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ప్రజాగళం సంద ర్భంగా బుధవారం నగరానికి వచ్చిన చంద్రబాబునాయుడు సమక్షంలో ఆమె టీడీ పీ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు వైసీపీ మండల స్థాయి నాయకుడు చల్లా అచ్చిరెడ్డి, చల్లవారిపాలెం ఎంపీటీసీ నాగరాజు, నల్లపాడు మాజీ సర్పంచి లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వారి అనుచరులు, 47వ డివిజన్ బీసీ యాదవ నేత దాడి శివబాబు, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, కాంగ్రెస్ నేత శివరామ్ రోహిత్, వడ్డెర సంక్షేమ సంఘం సీనియర్ నేత కుంచాల అంకమరావు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సంద ర్భంగా స్మిత పద్మజ మాట్లాడుతు తనను ఎన్నుకున్న ప్రజల కనీస సమస్యలను కూడా తీర్చలేని నిస్సహాయ స్థితిలో జగన్ నియంతృత్వ పోకడలకు విసిగి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దళితులకు సంబంధించి 27 పథకాలను రద్దు చేసిన జగన్ వైఖరికి నిరసనగా వైసీపీని వీడి, ఉమ్మడి మ్యానిఫెస్టో ద్వారానే ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరుగుతుందనే నమ్మకంతో టీ డీ పీలోకి చేరుతున్నట్టు తెలిపారు.

ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చా

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి


సమావేశంలో మాట్లాడుతున్న గల్లా మాధవి, పక్కన శేషయ్య

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): తాను ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గల్లా మాధవి చెప్పారు. గుజ్జనగుండ్లలోని 38, 39 డివిజన్ల ప్రజలతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. అనంతరం రజకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సమావేశా ల్లో ఆమె మాట్లాడుతూ టీడీపీకి ఉతికి ఆరేయడం ఏమీ కొత్తకాదని, వైసీపీ చేసిన అవినీతిని ఉతికి ఆరేయడమే టీడీపీ అభ్యర్థిగా తన పని అని చెప్పారు. రాబోయే రోజుల్లో గుంటూరులో అవినీతి అనేదే లేకుండా చేస్తానని ఆమె చెప్పారు. ఒక సాధారణ బీసీ కుటుంబంలో పుట్టి, కష్టాలు, కడగండ్లతో పెరిగిన మహిళగా ప్రజా సంక్షేమం చేయడానికే రాజకీయా ల్లోకి వచ్చానని చెప్పారు. ప్రజలను పీడించడానికే అవతలి వాళ్ళు ఉన్నారని, ఎన్నికల్లో ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఓటు వేయాలని గల్లా మాధవి కోరారు. ఈ కార్యక్రమంలో మానం పద్మశ్రీ, సింగంశెట్టి వీరయ్య తదితరులు పాల్గొన్నారు. దాసరి శ్రీను ఏర్పాటు చేసిన కాపు నేతల ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి గల్లా మాధవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కాపు నేతల సమావేశంలో మాట్లాడుతున్న డేగల, నసీర్

కాపుల సత్తా చూపిస్తాం.. నసీర్‌ను గెలిపిస్తాం

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కాపుల సత్తా చూపించి, తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్‌ను అఖండ మెజారిటీతో గెలిపిస్తామని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల కాపు నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తూర్పు అభ్యర్థి నసీర్ హాజరయ్యారు. నసీర్ గెలుపుపై సమావేశంలో వారు చర్చించారు. ఈనెల 5వ తేదీ పొన్నూరు రోడ్డులోని బి కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ కాపు వర్గీయుల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కాపులందరూ కలిసి కట్టుగా ఉండి కూటమి గెలుపుకి కృషి చేయాలని, కూటమి ద్వారానే కాపులకు అభివృద్ధి ఉంటుందని అన్నారు. వైసీపీ పాలనలో కాపులను కేవలం ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారని ఆయన ఆరోపించారు. నసీర్ మాట్లాడుతూ కాపుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. కాపు భవనాలు, హాస్టళ్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కాపులందరూ కూటమి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నాయకురాలు పాకనాటి రమాదేవి, బీజేపీ నాయకుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, యర్రగోపు నాగేశ్వరరావు, కార్పొరేటర్ పోతురాజు సమత, బిట్రగుంట మల్లికా, మేకల రవీంద్ర, కొలగాని సుబ్బారావు, జాడ సురేష్, శేఖర్, ఐలా శ్రీను, పోతురాజు వెంకట్ పాల్గొన్నారు.

కార్మికుల రక్తం చిందించిన పోరాట దినం మేడే

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గుంటుపల్లి


మేడే పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి, హక్కులు సాధించిన రోజే ఈ మేడే అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు చెప్పారు. మేడే సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో టీఎన్‌టీయూసీ నాయకులు జెండా ఎగురవేసి కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన చంద్రన్న బీమా పథకాన్ని మరలా పునరుద్ధరించి అసంఘటిత కార్మికులందరికీ వర్తింప జేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా జోషి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మదమంచి శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్లా, రావినూతల ప్రభుదాస్, చౌదరి శ్రీను, ఎడ్లూరి నిరీక్షణరావు, కంచర్ల సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర రావు, ఎం.సాంబశివరావు, పి.రాము, రాంబా బు, కె.గోపి, జి.అప్పారావు, ఏ. రమేష్, ఆనందరావు, వి. జయంత్ బాబు, అశోక్, మోహన్ పాల్గొన్నారు.

● సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. సంగడిగుంట, రేగుల భవన్, బైండింగ్ వర్కర్స్ యూనియన్, జిన్నింగ్ విభాగం, సివిల్ సప్లైస్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 8 గంటల స్థానంలో 12 గంటలు పని చేయించడంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ముఠా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు జీ.సురేష్‌బాబు, అధ్యక్షుడు రావుల అంజిబాబు, కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతురావు, కొత్త శివారెడ్డి, రామినేని శ్రీనివాస్, రేగుల రాఘవ, నల్ల వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

● సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఎం కార్యలయం వద్ద ఆ పార్టీ తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు జెండా ఆవిష్కరించగా, ప్రగతినగర్, ఆటోనగర్, ఏలూరు బజార్‌ల వద్ద సీఐటీయూ తూర్పు కమిటీ కార్యదర్శి కే.శ్రీనివాసరావు, ఇతర నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ రావు, చిష్టీ, వెంకట్రావు, కళ్యాణి, దీవెనరావు, టీ.రాధా పాల్గొన్నారు.

● అరండల్‌పేట ఎల్ఐసీ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు, ఇన్సూరెన్స్ యూనియన్ అధ్యక్షుడు జి.రాజేంద్రప్రసాదు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, ఏ.శివయ్య, వి.కృష్ణంరాజు, ఎం.రాజేశ్వరరావు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ తేజ, ఎంపీ శాస్త్రి, కేవీ సుబ్రహ్మణ్యం, ఎన్.విజయరాజు, పి.శ్రీనివాసరావు, ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడేను నగరంలో వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సంగడిగుంట షేక్ బుడే గ్రంథాలయం వద్ద జెండాను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు ఆవిష్కరించగా, బుడే స్మారక విగ్రహానికి అఖిల భారత విప్లవ మహిళా సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు వెనిగళ్ళ పుష్పలత పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అలాగే లాంచెస్టర్ రోడ్డు ఐదవ లైను సెంటర్లో జిల్లా కార్యదర్శి పిల్లి చెన్నకేశవులు, లింగాయపాలెం, కొల్లా వెంకయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆ పార్టీ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ జెండాలను ఆవిష్కరించారు.

● గుంటూరు(విద్య), మే 1 : స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పతాకావిష్కరణ చేశారు. కార్మిక సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శివ పార్వతి, జిల్లా కార్యదర్శి గోవిందు, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్, షకీలా బేగం, ధన రాజారావు, అంకమ్మరావు, నాగమణి, బురాన్, ప్రసాద్, శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

టీడీపీతోనే నాయీబ్రాహ్మణుల సంక్షేమం : నసీర్



మాట్లాడుతున్న నసీర్, పాల్గొన్న శ్రీరత్న, సుభాని తదితరులు

గుంటూరు(తూర్పు), మే 1 : రాబోయే నూతన ఎన్డీఏ ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్టు నగర తూర్పు ఎన్డీఏ అభ్యర్థి నసీర్ అహమద్ తెలిపారు. స్థానిక పాతగుంటూరు నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ సమావేశ మందిరంలో ఏపీ నాయీబ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలోని నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు నాయీబ్రాహ్మణుల సహకరించాలని కోరారు. పొలిటికల్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునగాటి రాజారావు సభకు అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు చేస్తామన్న జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు నాయీబ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నదన్నారు. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున నాయీబ్రాహ్మణులు పాల్గొని టీడీపీకి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మల్లాది నాగరాజు, జిల్లా కార్యదర్శి అద్దంకి రవి, తుళ్లూరు కిరణ్, జిల్లా సెక్రటరీ కల్వకూరి రోజ్‌కుమార్, సంఘ నాయకులు ఉప్పలపాటి కృష్ణ తదితరులు పాల్గొనగా, ముఖ్య అతిథులుగా పెమ్మసాని శ్రీరత్న, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, రాష్ట్ర నాయకుడు చిట్టాబత్తిని చిట్టిబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

ఆర్‌వీఆర్ జేసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు(విద్య), మే 1 : స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలలోని 64 మంది ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు రూ.5.78 లక్షల వార్షిక వేతనం అందుకోనున్నట్లు తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, మార్కెటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగాల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీకృష్ణ, కళాశాల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస రావు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి చక్రధర్ తదితరులు అభినందించారు.


విద్యార్థులతో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

చిప్స్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(విద్య),మే 1: స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం దివీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాంగణ ఎంపికల కోసం మొత్తం 120 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా వారిలో 71 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్ అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఎస్పీ కార్తీక

ఈవీఎంల ర్యాండమైజేషన్ పరిశీలించిన కేంద్ర ఎన్నికల పరిశీలకులు

గుంటూరు(కార్పొరేషన్), మే 1 : కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశిత మార్గదర్శకాల మేరకు ఈవిఎంల ర్యాండమైజేషన్ విధానం ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంల కేటాయింపు చేస్తున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు ఎస్.పి. కార్తీక, తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఆధ్వర్యంలో ఈవీఎంల ర్యాండమైజేషన్‌ని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో చేపట్టారు. కమిషనర్, ఆర్ఓ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల బ్యాలెట్ యూనిట్ల కేటాయింపునకు ఈవిఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎలక్ట్రోరల్ రోల్‌ని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు అందిస్తామని, గుర్తింపు లేని పార్టీల ప్రతినిధులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎలక్ట్రోరల్ రోల్ కావాలి అంటే నిర్దేశిత రుసుం చెల్లించి తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమా ర్, ఈఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సూపరింటెండెంట్‌లు పద్మనాభరావు, రవికిరణ్‌రెడ్డి, అభ్యర్థులు, ఎలక్షన్ ఏజంట్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు: కమిషనర్

ప్రభుత్వ ఉద్యోగులు, అప్కాస్ ఉద్యోగులు ఎవరైనా రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొన్నా, ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జీఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు గార్లపాటి లక్ష్మీని విధుల నుండి తొలగిస్తూ ఆర్వో ఉత్తర్వులు జారీ చేశారు.

అభ్యర్థులు తప్పనిసరిగా ఖర్చు రిజిష్టరు నిర్వహించాలి

● కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు వినోద్ కుమార్ చంద్రవన్

గుంటూరు(కార్పొరేషన్), మే 1 : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఖర్చుల రిజిష్టర్లు పక్కాగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్, గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు వినోద్ కుమార్ చంద్రవన్ తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ రిటర్నింగ్ అధికారులు కీర్తి చేకూరి, కె. రాజ్యలక్ష్మిలతో కలిసి పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల వ్యయ విధానంపై వివరించి, అభ్యర్థుల వ్యయ రిజిస్టర్లను పరిశీలించారు.

నేడు మహిళా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు(విద్య) ,మే 1: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి ఆర్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రజాగళం రోడ్ షో, బహిరంగ సభ నిమిత్తం బుధవారం గుంటూరు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. - గుంటూరు.



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

యువత భవిష్యత్తుకు ఈ ఎన్నికలు కీలకం

- టీడీపీతోనే యువతకు భవిష్యత్తు
- మంగళగిరిలో నారా బ్రాహ్మణి



మహిళా ఉద్యోగినులతో ఉత్సాహంగా సెల్ఫీ దిగుతున్న బ్రాహ్మణి

మంగళగిరి, మే 1: గత అయిదేళ్లలో రాష్ట్రంలో యువత ఉపాధి, ఉద్యోగవకాశాలు లేక భవిష్యత్తును తీవ్రంగా నష్టపోయిందని నారా బ్రాహ్మణి అన్నారు. ఈ పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే యువతపై ఆధారపడిన కుటుంబాలు భయంకరమైన దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. అందుకే యువత భవిష్యత్తుకు జరుగనున్న ఎన్నికలు చాల కీలకమైనవైనవని.. ప్రతీ యువతి, ప్రతీ యువకుడు బాగా ఆలోచించి ఓటేయ్యాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి బ్రాహ్మణి బుధవారం మంగళగిరిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆటోనగర్‌లోని పై కేర్ డాటా సెంటర్‌ను ఆమె సందర్శించారు. 2017లో లోకేశ్ ఐటీశాఖ మంత్రిగా వున్నపుడు ఆయన ఆహ్వానం మేరకు పైకేర్ కంపెనీని మంగళగిరిలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కంపెనీలో 650 మంది యువతీ యువకులు ఉద్యోగాలను చేస్తున్నారు. కంపెనీ సందర్శన సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ గత అయిదేళ్ల కాలంలో కొత్తగా రాష్ట్రానికి ఏతరహా కంపెనీలు రాకపోగా అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయన్నారు. దీంతో యువత ఉద్యోగాల కోసం పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సివచ్చిందన్నారు. అందుకే తాను యువతకు తాను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నిరుద్యోగం అనే మాటే వినబడదన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, కొత్తకొత్త పరిశ్రమలు, ఐటీ సంస్థలను రప్పించడంలో తెలుగుదేశానికి వేరేవ్వరూ సాటిరారని ఆమె నొక్కి చెప్పారు. రాబోయే కాలంలో పై కేర్ కంపెనీ పదివేల మందికి ఉపాధి కల్పిస్తుందన్న ఆశాభావాన్ని బ్రాహ్మణి వ్యక్తం చేశారు.

కష్టపడే తత్వం, పట్టుదల వుంటి లక్షణాలు మహిళలను సమాజంలో ప్రత్యేకంగా నిలుపుతాయనడంలో సందేహం లేదని చెప్పారు. మహిళలకు సరైన ప్రోత్సాహాన్ని ఇవ్వాలేకానీ మహిళలు అద్భుతాలను సృష్టిస్తారన్నారు. పైకేర్ కంపెనీలో ఇంతమంది మహిళలు పనిచేయడం తాను మొదటిసారి చూస్తున్నానన్నారు. తాను కూడ హెరిటేజ్‌ఫుడ్స్, బసవతారకం కాన్సర్ హాస్పిటల్, ఎన్టీఆర్ ట్రస్టు నిర్వహణలో భాగస్వామిగా ఉన్నానంటే అందుకు తన భర్త లోకేశ్, అత్తమామల సహకారమే కారణమని బ్రాహ్మణి అన్నారు.

పైకేర్ కంపెనీ ఛైర్మన్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో ఏపీకి వచ్చిన మొదటి కంపెనీ తమదేనన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లోకేశ్ ఎంతో తపన పడేవారన్నారు. లోకేశ్ ప్రోత్సాహంతోనే మంగళగిరిలో తమ పైకేర్ డాటా సెంటర్‌ను ప్రారంభించామన్నారు. గత అయిదేళ్లలో మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందకపోయినప్పటికీ తాము ఎంతో ధైర్యంగా కంపెనీని నడుపుతూ వచ్చామన్నారు. తమ ఈ కంపెనీలో భవిష్యత్తులో మరింతమందికి ఉద్యోగవకాశాలను కల్పిస్తామని ఆయన భరోసాగా చెప్పారు. కాగా, బ్రాహ్మణితో మాట్లాడేందుకు ఐటీ ఉద్యోగులు ఉత్సాహాన్ని కనబరిచారు. భవిష్యత్తులో మరిన్ని కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలను కల్పించాలని వారు బ్రాహ్మణికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమం జరిగినంతసేపు పైకేర్ డాటా సెంటర్ ప్రాంగణం జై బాలయ్య నినాదాలతో మార్మోగిపోయింది.

ప్రార్థనాలయాల్లో ఎన్నికల ప్రచారం వద్దు

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రార్థనాలయాల్లో ఏ ఒక్క రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించొద్దని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై జిల్లా స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయపార్టీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంకు 30 మంది, తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గంకు 10 మంది, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంకు 40 మంది, పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంకు 14 మంది, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంకు 13 మంది, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంకు 13 మంది, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంకు 28 మంది, గుంటూరు తూర్పు నియోజకవర్గంకు 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా వచ్చిన 286 ఫిర్యాదులలో 279 (98శాతం) నిర్దేశించిన 100 నిమిషాల వ్యవధిలో పరిశీలించటం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై 60 కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో చిరతనగండ్ల వాసు(బీఎస్పీ), పీఏ పద్మనాభరావు(బీజేపీ), కమ్యూనిస్ట్ పార్టీ ఇండియా (మార్క్సిస్ట్) తరుపున వై.కృష్ణకాంత్, బిళ్లా సునీల్(కాంగ్రెస్), కంచర్ల శివరామయ్య(టీడీపీ), అత్తోట జోసఫ్(వైసీపీ)పాల్గొన్నారు.

వైసీపీ.. ఔట్

- వరగానిలో కిరణ్‌ని తాకిన అసమ్మతి సెగ
- బలసాని పర్యటన ముగిసిన నిమిషాల వ్యవధిలోనే ఫ్లెక్సీల తొలగింపు
- 200 మందితో తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకు మంతనాలు

పెదనందిపాడు, మే 1: ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీకి గడ్డు పరిస్థితి ఎదురైంది. బలసాని కిరణ్ కుమార్‌ను వైసీపీ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి గ్రూపులకు ఆజ్యం పోసినట్టు అందరూ రగిలిపోతున్నారు. పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కొందరు ముఖ్య నేతలు సైతం బలసాని కిరణ్ కుమార్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో ఇప్పటికే వైసీపీ నుంచి వేల సంఖ్యలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయి. కరుడుగట్టిన వైసీపీ నాయకులు సైతం టీడీపీ పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. అయితే పెదనందిపాడు మండలంలో ఓ వర్గం మాత్రం ఏకంగా ఒక అడుగు ముందుకు వేశారు. మేము ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ఉండటానికి వీలు లేదని పూర్తిగా కార్యాలయాన్ని మూసి వేశారు. ముఖ్యమంత్రి జగన్‌తో పాటు కిరణ్ కుమార్ ఉన్న పెక్సీలను, బోర్డులను పీకి వేసి కార్యాలయాన్ని ఏకంగా మూసివేశారు. బలసాని కిరణ్ కుమార్ వరగానిలో ప్రచారం చేసి గ్రామం దాటిన నిమిషాల వ్యవధిలోనే ఫ్లెక్సీలను చింపి వేశారు.

బలసానిపై అసమ్మతే కారణం

బలసాని కిరణ్ కుమార్ ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా వచ్చిన నాటి నుంచి ఆయన ఒక వర్గానికే కొమ్ముకాస్తూ వస్తున్నాడు అనే వాదన వైసీపీ వర్గాల్లో బలంగా ఉంది. ఈ క్రమంలో గ్రామాలలో గ్రూపులకు కొమ్ము కాస్తూ ఒక వర్గాన్నే పక్కన పెట్టుకుంటున్నాడని వైసీపీ నాయకులే ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అధికంగా ఉండే మాల సామాజిక వర్గాన్ని పూర్తిగా దూరం పెట్టారనే వాదన కూడా వినిపిస్తుంది. ఈ క్రమంలోనే వరగానిలో పర్యటన వివరాలను ఒక వర్గానికి చెప్పి, మరో వర్గాన్ని దూరంగా పెట్టారు. దీంతో కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఈ విధంగా తమను అవమానించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం జెండాలు మోసి, ఫ్లెక్సీలు కట్టి డబ్బులు ఖర్చు పెడుతున్న తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వారు బావించారు. తమ గౌరవం లేని చోట ఒక్క నిమిషం కూడా ఉండకూడదని బావించిన వైసీపీ నాయకులు కార్యకర్తలు తాము ఏర్పాటు చేసి పార్టీ కార్యాలయాన్ని మూసి వేసి ఫ్లెక్సీలను చింపి పడేశారు. అంతటితో ఆగకుండా తెలుగుదేశం పార్టీలోనికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వెంటనే తెలుగుదేశం పార్టీ మండల నాయకులతో సమావేశ మయ్యారు.



పార్టీ ఫ్లెక్సీలతో దర్శనమిస్తున్న వైసీపీ కార్యాలయం



వరగానిలో వైసీపీ కార్యాలయంపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించిన దృశ్యం

ఏజెంట్లు కోవర్టులుగా ఉంటే అభ్యర్థులు మటాషే..!

రెంటచింతల, మే 1: ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల్లో కూర్చుని దొంగ ఓట్లను నివారించే ఏజెంట్ల చేతిలో పోటీలో వుండే ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఆధారపడి ఉంది. మార్చి 16 నుంచి పడిన కష్టానికి ఆ ఒక్క రోజే ఫలితం ఇవ్వనుంది. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అని గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా చూడడం ఏజెంట్ల విధి. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలికను ఏజెంట్ నిశితంగా పరిశీలించి ప్రిసైడింగ్ ఆఫీసర్(పీవో) దృష్టికి తీసుకెళ్లాలి. అనుమానం వస్తే తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేయవచ్చు. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు తమకు నమ్మకమైన వారినే కూర్చోపెట్టాలి. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా బెదిరింపులకు భయపడినా ఎదుటి పార్టీకి కోవర్టుగా మారినా పోటీలో వున్న వారు ఇంతే సంగతులు చిత్తగించవలెను. ఎన్నికల్లో పెట్టిన కోట్ల ఖర్చు, శ్రమ నీళ్లపాలవుతుంది.

ఓటు వేయడానికి ఇవి చూపిస్తే చాలు



వివిధ రకాల ఐడీ కార్డులు

రెంటచింతల, మే 1: రానున్న ఎన్నికల్లో గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చని భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు,పోస్టాఫీసు లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటో ఉన్న పాసు పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకార్డు, ఫించన్ మం జూరుచేసిన డాక్యుమెంట్, దివ్యాంగుల ఐడీ కార్డు చూపించి ఓటు వేయవచ్చు.

జగన్ రెడ్డిని ఓడించండి

- ఆయన మాదిగ రిజర్వేషన్లకు వ్యతిరేకి..
- చంద్రబాబుతోనే మాదిగలకు సంపూర్ణ న్యాయం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ
- సమావేశంలో పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే1: జగన్‌మోహన్‌రెడ్డి అనేక సందర్భాల్లో మాదిగ లకు ఇచ్చిన హామీలను విస్మరించారని, మాదిగలను మోసం చేశా రని, రాష్ట్రంలోని ఆయనను ఓడించాల్సిన అవసరం ఉందని ఎమ్మా ర్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం క్రోసూరులో టీడీపీకూటమి ఆధ్వర్యంలో టీడీపీ అచ్చంపేట మండల అధ్యక్షుడు నం దిగం ఆశీర్వాదం అధ్యక్షతన మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. అసెంబ్లీలో మాదిగ రిజర్వేషన్‌కు వ్యతిరే కంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారన్న విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మాదిగలకు అన్నివిధాలా న్యాయం జరిగిందన్నారు. అందుకే 2014లో చంద్రబాబుకు ఎమ్మా ర్పీఎస్ టీడీపీకి మద్దతు ఇచ్చిందన్నారు. అయితే కొన్ని కారణాలతో 2019లో ఎమ్మార్పీఎస్ బాబుకు మద్దతు ఇవ్వలేదని, మరళా ఇప్పుడు మాదిగలకు సంపూర్ణ న్యాయం చేస్తానని చంద్రబాబు చెప్పడంతోనే మద్దతు ఇస్తున్నామని ఆయన తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుందని, దాని వల్ల మాదిగలకు వంద తరాల వరకు ప్రయోజనం కలుగుతుం దన్నారు. మాదిగ సోదరులం దరూ ఐక్యంగా మే 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాదిగ జాతికి న్యాయం జరగాలంటే టీడీపీ కూటమి విజయం సాధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ మద్దతుతో తమ నియోజక వర్గంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి బలం రెట్టింపు అయిందన్నారు. అనేక సందర్భాల్లో కృష్ణ మాదిగను అనేక పదవులు వరించే అవకాశం ఉన్నప్పటికీ మాదిగ జాతి కోసం ఆయన వాటిని తృణప్రాయంగా వదులుకున్నార న్నారు. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ కృష్ణమాదిగ ఆధ్వర్యంలో క్రోసూరులో జరిగిన ఆత్మీయ సమావేశంతో తమలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింద న్నారు. సైకిల్‌గుర్తుపై ఓటువేసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం మంద కృష్ణమాదిగను శ్రీకృష్ణదేవరాయలు, ప్రవీణ్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, స్థాని క నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కృష్ణ మాదిగను సత్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్

- అభిమానుల కేరింతలు...









బుధవారం గుంటూరులో జరిగిన ప్రజాగళంలో ప్రసంగిస్తున్న గల్లా మాధవి, నసీర్, వేదికపై చంద్రబాబునాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు





చిర్రావూరులో టీడీపీ కూటమి అభ్యర్థుల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థులు

తాడేపల్లి, మే 1: ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో మంగళవారం సాయంత్రం టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, అంకం కాళీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు సూపర్ సిక్స్ పథకాలను, నారా లోకేశ్ ప్రకటించిన నియోజకవర్గ మానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేశ్‌ను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తాడేపల్లి మండల జనసేన, చిర్రావూరు గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. కాగా కొలనుకొండలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు లింగాల శ్రీకాంత్, కంచర్ల రంగారావు, మండల జనసేన అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, బడే కోమలి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, మండల మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ ప్రభుత్వంలో దళితులపై పెరిగిన దాడులు

● దళితులను హత్యలు చేసిన వారికి పదవులు

● నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళనంలో శ్రావణ్



దళితుల ఆత్మీయ సమావేశంలో ఎన్‌డీఏ కూటమి మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న శ్రావణ్‌కుమార్, హెనీ క్రిస్టినా, విజయ్‌శేఖర్, బ్రహ్మయ్య

తాడికొండ, మే 1: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై జరిగినన్ని దాడులు ఎప్పుడూ జరగలేదని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తాడికొండ నియోజకవర్గం దళితుల ఆత్మీయ సమావేశాన్ని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీలు గంపగుత్తగా వైసీపీకి అనుకూలంగా ఉన్నారనే తప్పుడు ప్రచారం జరుగుతుందన్నారు. జగన్ పరిపాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తికరంగా లేరు. దళితులపై దాడులు, హత్యలు చేసిన వారికి వైసీపీ పార్టీలో పదవులు దక్కాయని అన్నారు. దళితుల ఓట్లతో పదవి పొందిన వారికి జగన్ పార్టీలో సముచితస్థానం ఇవ్వటం లేదన్నారు. ఆర్థికపరమైన వెసులుబాటు, భూమికి సంబంధించిన హక్కులు, ఆర్థికాభివృద్ధికి కావాల్సిన పరిశ్రమలు మనదగ్గర లేవు. ఇంకా అస్థాయికి కింది వర్గాలు ఎదగలేదు. పేద వర్గాల సంక్షేమ కోసం పాడుపడటానికి, కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశ సూత్రాల్లో స్పష్టంగా రాశారన్నారు. ఉచిత బియ్యం, ఇళ్లు, స్కాలర్ షిప్‌లు, కార్పొరేషన్ల ద్వారా ఆర్థికపరమైన లోన్లు ఏవరో ఇచ్చే దయా దాక్షిణ్యం కాదు. ఇది రాజ్యాంగ పరమైన హక్కు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రావాలనేది నా కోరిక. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేస్తు బయటకు వచ్చానంటేనే మీరు అర్థం చేసుకో వచ్చునని అన్నారు. నా బాధను, అవేదనను మీతో పంచుకుంటున్నా అన్నారు. పదవి ఇచ్చారు. కానీ అధికారం మొత్తం వారి చేతుల్లోనే ఉం టుందని పేర్కొన్నారు. వైసీపీలో దళితులకు న్యాయం జరగట్లేదన్నారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత జగన్ దగ్గరకు వెళ్లి మాకు రాజకీయాలు సరిపోవు మేము వెళ్లిపోతాం అంటే ఎక్కడ ఓడిపోయారో అక్కడే గెలవాలి అని జగన్ చెప్పారు. అలాగే పార్టీ కోసం కష్టపడ్డాం. 2019లో సీటు ఇవ్వలేదు. 2024లో తాడికొండలో సీటు ఇస్తామని చెప్పారు.. తరువాత యర్రగొండపాలెం అన్నారు... వేమూరు అన్నారు.. కానీ సీటు ఇవ్వక పోవటంతో పాటు ఆర్థికంగా నష్టపోయాం. దళితులకు ఆ పార్టీలో గౌరవం దక్కదని వాపోయారు. ఇప్పటికైన రాష్ట్రంలోని దళితులు ఆలోచించుకొని ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, జనసేనపార్టీ నియోజకవర్గ కన్వీనర్ బేతపూడి విజయ్‌శేఖర్, నాయకులు కత్తెర సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

● ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో బుధవారం చేరారు. ఫిరంగిపురం మండలం జేసీఎస్ మండల కన్వీనర్ పెరికల మరియబాబు, పెరికల జయప్రకాష్, కే జగజ్జీవనరావు, మట్టుకొయ్య వంశీ, మట్టుకొయ్య బాలజీలు చేరారు.

ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారు?

● అమరావతి విషయంలో ఆళ్ల వెన్నుపోటు

● మంగళగిరి ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చారు

● ఐదేళ్లలో కాండ్రు కుటుంబం బయటకొచ్చిందా?

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల ధ్వజం



కొత్తపేటలో ప్రచారం చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు

మంగళగిరి సిటీ, మే 1: ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చి, రాష్ట్ర ప్రజల నెత్తిన పెనుభారాన్ని మోపిన వైసీపీ నేతలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని కూటమి నేతలు ధ్వజమెత్తారు. మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్‌కు మద్దతుగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అమరావతి రైతులు బుధవారం పట్టణంలోని 1, 2, 11, 12 వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కాండ్రు కుటుంబం గడిచిన అయిదేళ్లలో ఏనాడైనా బయటికి వచ్చిందా అని ప్రశ్నించారు. అమరావతి విషయంలో వారి మద్దతు ఎటువైపో చెప్పి ఇక్కడి ప్రజలను ఓట్లడగాలని డిమాండ్ చేశారు. అమరావతి ఇక్కడే ఉంటుందని మంగళగిరి ప్రజలను నమ్మించిన ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈ ప్రాంతానికి వెన్నుపోటు పొడిచి రాజధానికి భూములిచ్చిన రైతులను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. గత అయిదేళ్లలో మంగళగిరి ప్రజలను జలగల్లా పీల్చుకుతిన్నారని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్ర రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం కల్తీ మద్యం, గంజాయికి కేంద్రంగా మార్చి యువత జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. అరాచక పాలన నుంచి విముక్తి కావాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా చంద్రబాబు, లోకేశ్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్, కూటమి నేతలు విన్నకోట శ్రీనివాసరావు, సంకా బాలజీగుప్తా, షేక్ అక్రమ్, షేక్ సుభానీ, దామర్ల మోహన్, తాడిబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారు

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కృష్ణయ్య

తాడేపల్లి, మే 1: కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం వడ్డేశ్వరం రహదారి వద్ద ఉన్న కేబీ భవన్‌లో మేడే కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సంఘాల జెండాలను రైతు సంఘం సీనియర్ నాయకుడు వై కేశవరావు, దడాల సుబ్బారావు, మాగంటి హరిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వంకాయలపాటి శివనాగరాణి, అప్పలస్వామి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్, మే 1: తాడేపల్లి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ అండతోనే కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని సీఐటీయూ నాయకులు ఆర్వీ రాఘవయ్య అన్నారు. పట్టణంలోని బోటు యార్డు వద్ద ఉన్న పీడబ్ల్యూడీ వర్క్ షాప్ గేట్ ఎదురు మేడే సందర్భంగా సీఐటీయూ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి, రాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడే జెండాను శీలం శ్యామ్ ఆవిష్కరించారు. నులకపేట యూనియన్ ఆఫీస్‌లో మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

పెదనందిపాడు, మే 1 : మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో సీపీఎం, సీఐటీయూ భవన నిర్మాణ కార్మికసంఘం, పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలు నిర్వహించారు. ఆయా నాయకులు కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, మద్దుల రాము, రిక్షా ఆటో కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, మే 1: తాడికొండ మార్కెట్‌యార్డు, పంచాయతీ కార్యాలయం, అడ్డరోడ్డు ఆటో వర్కర్స్ యూనియన్, పొన్నెకల్లు పంచాయతీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ వర్కర్స్ యూనియన్ తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద ఎర్రజెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియా కూటమి అభ్యర్థి మంచాల సుశీల రాజా, వ్యకాస రాష్ట్ర కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రీమియర్‌లీగ్ ట్రోఫీ విన్నర్ 'స్కూల్‌ఫ్రెండ్స్'

దుగ్గిరాల, మే 1: దుగ్గిరాలలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి పరిసర గ్రామాలకు చెందిన క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ నిర్వహించిన దుగ్గిరాల ప్రీమియర్ లీగ్ విజేతగా దుగ్గిరాల స్కూల్‌ఫ్రెండ్స్ జట్టు నిలిచింది. ఈనెల 7వతేదీ నుంచి 30వతేదీ వరకూ వివిధ గ్రామాలకు చెందిన జట్టు పాల్గొనగా, ఫైనల్‌లో దుగ్గిరాల ఫ్రెండ్స్, స్కూల్‌ఫ్రెండ్స్ జట్లు తలపడ్డాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఫైనల్‌లో విజేతగా నిలిచిన స్కూల్‌ఫ్రెండ్స్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30వేల నగదు బహుమతిని అందించారు. రన్నర్‌జట్టు దుగ్గిరాల ఫ్రెండ్స్ జట్టుకు రూ.20వేల నగదు బహుమతిని అందించారు. తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేల నగదు బహుమతిని అందించారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, గూడూరు వెంకట్రావుల సహకారంతోల నిర్వహించిన పోటీల బహుమతి ప్రదానోత్సవంలో కాకా బాబు, ఎద్దు ప్రసాద్, టీ. సుబ్బు, డీ. నాగు, డీ. కోటి తదితరులు పాల్గొన్నారు.

నేడు అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ళ

వట్టిచెరుకూరు, మే 1: వట్టిచెరుకూరు గ్రామ ప్రజల ఆరాధ్యదైవం, గ్రామదేవత అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ళ బుధవారం రాత్రి 10 గంటలకు మారెమ్మవారి కొలుపులతో ప్రారంభమవుతాయి. గ్రామంలోని లైబ్రరీ సెంటర్‌లో తాత్కాలికంగా పురం (రెల్లుతో పూరి కుటీరం) నిర్మించి గ్రామ దేవత మారెమ్మవారి ప్రతిమను బుధవారం రాత్రి మేళతాళాలు, కనకతప్పెట్లతో ప్రతిష్ఠించారు. గురువారం ఉదయం అమ్మవారికి గ్రామ ప్రజలు కుటుంబసభ్యులతో ఊరేగింపుగా వచ్చి 'సద్ది' సమర్పించిన అనంతరం అమ్మవారి బొమ్మను ఊరేగింపుగా గ్రామానికి తూర్పు వైపున పొలిమేరలో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠిస్తారు. అలాగే గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం పోలేరమ్మవారి ఆలయం నుంచి అద్దంకమ్మ వారి ఆలయానికి శిడిమాను ఊరేగింపు నిర్వహిస్తారు. సోమవారం అమ్మవారికి నైవేద్యాల సమర్పణతో తిరునాళ్ళ ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంపు

ఫిరంగిపురం, మే 1 : ఫిరంగిపురం క్రిష్టియన్ ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంపు మే ఒకటి నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఫిరంగిపురం సీఎఫ్‌సీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలోని గాలిబాలి మినీ స్టేడియంలో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్నామని, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వంగివరపు శ్రీనివాసరావు ఈ క్యాంపును ఏర్పాటు చేశారని కోచ్ తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్థుల రోడ్ షో

● జొన్నా, జంగాలను గెలిపించాలని పిలుపు

తాడేపల్లి టౌన్, మే 1: పట్టణంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ రోడ్ షో నిర్వహించారు. తాడేపల్లి ముగ్గురోడ్డు నుంచి ఈ రోడ్ షోను నిర్వహించారు. కనకతప్పెట్లు, డప్పులతో కార్యకర్తలు రోడ్ షోలో అలరించారు. సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, కొట్టే కరుణాకర్, కాంగ్రెస్ నేత, దర్శనపు శామ్యూల్, సీపీఐ నేతలు తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, శ్యామ్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ, సీపీఎం రాష్ట్ర నేతల పర్యటన

మంగళగిరి, మే 1: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పీ మధు గురువారం మంగళగిరిలో పర్యటించనున్నారు. ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి ఎన్నారై జంక్షన్ నుంచి పాత కూరగాయల మార్కెట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. గాంధీ విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభలో నేతలు ప్రసంగిస్తారని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వామపక్ష ప్రజాతంత్ర శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆటవిక పాలన చేస్తున్న జగన్‌ను ఇంటికి పంపుదాం

● ప్రత్తిపాడు ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మే 1: అరాచకాలు, అవినీతిపాలన చేస్తున్న జగన్‌ను ఇంటికి పంపాలని ప్రత్తిపాడు ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం గుంటూరు రూరల్ పరిధిలోని గోర్లవారిపాలెంలో ఇంటింటికి పర్యటిస్తూ సూపర్‌సిక్స్ శంఖారావం ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీసం తాగునీరు సౌకర్యం కల్పించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నా వైసీపీ నాయకులు, అధికారులు పట్టిం చుకోవడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నియోజకవర్గ పరిధిలో నెలకొన్న నీటిసమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ మండల అధ్యక్షుడు గంధం సురేష్, ఇమ్మడి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాఫియాను ఎదుర్కోవాలంటే 'కూటమి' గెలవాలి

● బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య



నుదురుపాడులో మాట్లాడుతున్న బీజేపీ నేత కంతేటి బ్రహ్మయ్య

ఫిరంగిపురం, మే 1: రాష్ట్రంలో ల్యాండ్, శ్యాండ్, మైనింగ్ వంటి మాఫియాలు లేకుండా ఉండాలంటే కూటమి అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని బుధవారం నుదురుపాడు గ్రామంలో బీజేపీ నాయకులతో పర్యటించిన ఆయన మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో జగన్ భూమాఫియాకు తెర తీశారన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఉన్న దేవాలయ భూముల్లో 40వేల ఎకరాలు లెక్కకు రావటం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు విశ్వనాధుని హరిబాబు, ఆరేకూటి చంద్రశేఖరరెడ్డి, సరిపూడి సాంబశివరావు, చదలవాడ శ్రీనివాసరావు, మర్రివాడ శ్రీనివాసరావు, బత్తిని సుబ్బారావు, ఆరుద్ర గోపీ, చవిటికంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు బెదిరిస్తున్నారంటూ టిడ్కో లబ్ధిదారుల గగ్గోలు

తాడేపల్లి, మే 1: పెనమాక టిడ్కో గృహాల వద్ద తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీపీఎం నేతలు జొన్నా శివశంకర్, ఎం రవిలకు స్థానికులు బుధవారం వివరించారు. టిడ్కో గృహాల వారికి కెనరా బ్యాంకు అధికారులు నోటీసులు అంటించారని తెలుసుకున్న సీపీఎం నేతలు శివశంకర్ తదితరులు అక్కడకు వెళ్లగా స్థానికులు తమ బాధలు చెప్పుకున్నారు. ఆరు రోజులే బకాయిల చెల్లింపులకు గడువు అని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఆరు రోజుల్లో కట్టక పోతే మొండి బకాయిల పేరుతో పేపర్ ప్రకటన వేస్తామని పేపర్ యాడ్ నిమిత్తం లబ్ధిదారులు ఒక్కొక్కరూ మరో రూ.5వేలు అదనంగా చెల్లించాలని, మే 30 లోపు బకాయిలు చెల్లించపోతే ఇళ్లను వేలం వేస్తామని బ్యాంక్ అధికారులు బెదిరించారని స్థానికులు ఆరోపించారు. కాగా బ్యాంకు అధికారులను కలిసి సమయం ఇవ్వాలని సీపీఎం నేతలు కోరినా బ్యాంకు అధికారులు మొండిగా మాట్లాడుతున్నట్టు తెలిసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో టిడ్కో లబ్ధిదారులు అందోళనకు సిద్ధమవుతున్నారు.

5, 6 తేదీల్లో ఎన్నికల అధికారులకు శిక్షణ

మంగళగిరి సిటీ, మే 1: ఎన్నికల విధులు నిర్వహించాల్సిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణా కార్యక్రమం ఈ నెల 5, 6 తేదీల్లో జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పా ట్లను మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని నిర్మల హైస్కూల్లో జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి బుధవారం పరిశీలించారు. ఈ నెల 3వ తేదీ నుంచి జరుగనున్న ఈవీఎం కమిషనింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అన్నక్యాంటిన్ 100 రోజుల పండుగ

దుగ్గిరాల, మే 1: దుగ్గిరాలలోని రైలుపేటలో కార్మికులు, పేదల కోసం నిర్వహిస్తున్న అన్నక్యాంటిన్ 100రోజులు పూర్తిచేసుకుంది. దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నక్యాంటిన్ వద్ద కేకుకట్‌చేసి వేడుక నిర్వహించారు. బుధవారం జరిగిన అన్నక్యాంటిన్ భోజన కార్యక్రమం కన్నెగంటి మోహనరావు జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు, ఉయ్యూరు శ్రీనివాసరావులు సహకారంతో నిర్వహించారు. గూడూరు వెంకట్రావు, దేవరపల్లి చంటి, ఉన్నం వెంకయ్య, కీర్తి పవన్, ప్రసాద్, షేక్ లియా, కరీముల్లా వేణుగోపాల్, గద్దె శ్రీనివాస్, పర్వతనేని హర్ష, నక్కా చిరంజీవి,రవి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కూటమి అభ్యర్థులను గెలిపించండి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, మారీసుపేట మే 1: రానున్న ఎన్నికలలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని మాజీమంత్రి, టీడీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లెపాడులో బుధవారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల సభలో శృంగారపుపాటి సూరయ్య మిత్ర బృందం సభ్యులు 50 మంది వైసీపీని వీడి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ పినపాటి రవీంద్ర, సొపాటి కిరణ్, బాబురాజేంద్రప్రసాద్, ప్రసాద్, కొపల్లె శ్రీను, గోపి, కంచర్ల ఏడుకొండలు, పీటర్‌పాల్, రూపస్‌పాల్, శ్రీకాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, మే 1: పట్టణ టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో బుధవారం వైసీపీ పార్టీకి చెందిన 23వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ తోక శిరిష, ఆమె భర్త తోక వాసు, కరేటి రవి, మరి కొందరు అనుచరులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● తెనాలి, మారీసుపేట మే 1: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో బుధవారం 31వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబావలి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో జేరారు. కార్యక్రమంలో రజీకాంత్, రావి తేజ, శ్రీను, రవి, కొమ్మూరి వెంకటేశ్వర్లు, ఖాజీబాబు, ఖాజావలి, మస్తాన్‌వలి, అన్వర్‌బాష, సందాని, మాబు, జావెద్, బడే, రబ్బానీ, ముజీఫ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

అఖండ మెజార్టీతో గెలిపించాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు చినకోటిరెడ్డి

కొల్లిపర, మే 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినకోటిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదప్రజలను అన్ని విధాలా మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, భీమవరపు కమల, బొంతు చంద్రిక, భీమవరపు సునీత, కోమటి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ వెంకటేశ్వరరావు, ఆరిమండ వెంకటరెడ్డి, వల్లభాపురం బసవయ్య , కొండా కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

పొన్నూరు టౌన్, మే 1: ముస్లింల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని 25, 26 వార్డులో బుధవారం టీడీపీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మైనార్టీలు మాట్లాడుతూ వైసీపీ దుష్ప్రచారాలను నమ్మవద్దు అని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు

పొన్నూరు టౌన్, మే 1: పట్టణంలోని 6, 7 వార్డులకు ఇంటింటి రేషన్ బియ్యం సరఫరా ఎండీయూ ఆపరేటర్ ఎడ్లూరి మస్తాన్‌రావు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు అని టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసారు. మస్తాన్‌రావు ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేయటమే కాకుండా 2014 వైసీపీ బూత్‌లెవల్ ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ పంపిణీ చేసే నెపంతో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంబటి రాయుడికి ఘన స్వాగతం

పొన్నూరు టౌన్, మే 1: మాజీ క్రికెటర్, జనసేన నాయకుడు అంబటి తిరుపతి రాయుడిని బుధవారం పొన్నూరు పట్టణంలో జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న అంబటి రాయుడు మార్గమధ్యలో పొన్నూరులో ఆగారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అంబటి రాయుడికి స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా రాయుడు మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, యన్నం నాయుడు, దేశంశెట్టి సూర్య తాళ్లూరి అప్పారావు, సూదా వసంత్ తదితరులు పాల్గొన్నారు.

దశావతార వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

పెదకాకాని, మే 1: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి సామూహిక హోమ కళ్యాణము జరిపించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్



టీఎన్‌టీయూసీ ముఠా కార్మికుల సంఘం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నాదెండ్ల మనోహర్, వేదికపై పెమ్మసాని రత్నశ్రీ తదితరులు

తెనాలి రూరల్, మే 1: కార్మికుల సంక్షేమానికి ఉమ్మడి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నదని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని గంగానమ్మపేటలో టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకలకు నాదెండ్ల మనోహర్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి రత్నశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మనోహర్ మాట్లాడుతూ చెమటోర్చి కష్టపడే కార్మికులకు పూట గడవడం కూడా నేటి ప్రభుత్వపాలనలో కష్టంగా మారిందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం వాటి నిధులకు పక్కదారి మళ్లించి వారికి అందించే సాయాన్ని సైతం దక్కనివ్వకుండా దుర్మార్గంగా పాలన సాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రణాళికతో పాటు, వారి అభ్యున్నతిని అన్నివిధాలుగా కృషిచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చారు. పెమ్మసాని రత్నశ్రీ మాట్లాడుతూ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదన్నారు. చెడు తరువాత మంచి తప్పక వస్తుందని కార్మికులు ధైర్యంగా ఉండాలన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కార్మికులు పడ్డ ఇబ్బందులు అన్నీ, ఇన్నీ కావని కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఉపాధి లేక అప్పుకూడా దొరక్క, ప్రభుత్వం సాయం అందించక ఆ కుటుంబాలు పడ్డ వేదన తలచుకుంటేనే తన మనస్సు బాధతో నిండి మాట తడబడుతోందన్నారు. తన భర్త పెమ్మసాని చంద్రశేఖర్ సొంతగడ్డపై ప్రజలకు అండగా నిలవాలని రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గొప్ప ఆశయంతో ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను కార్మిక కుటుబాలందరూ ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్ తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధిచేసి మంచి మనిషిగా పేరు పొందారని అటువంటి వ్యక్తి తిరిగి అధికారంలోకి వస్తే ప్రాంతానికి కార్మికులందరికీ మంచి జరుగుతుందన్నారు. మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. తొలుత కార్మిక సంఘంలో పలు సేవలు అందించిన నాయకులను దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. యూనియన్ నాయకులు నర్రా సాంబయ్య, శేషగిరిరావు, గౌరవ అధ్యక్షురాలు జెట్టి రేణుక, కార్యదర్శి కన్నెగంటి మురళి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పలువురు కార్మిక సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటున్న నాదెండ్ల మనోహర్

● పట్టణంలోని గాంధీచౌక్‌లో భవన నిర్మాణకార్మికుల ఆధ్వర్యంలో, తెనాలి ఆటోనగర్‌లో, గంగానమ్మపేటలోని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇతర పలుప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో నాదెండ్ల మనోహర్ పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని కార్మికులకు అండగా ఉంటామని ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే ముస్లింలకు అండ

తెనాలి రూరల్, మే 1: హెలికాప్టర్‌లో తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి ముస్లింల కోసం షాదీఖానా కట్టిస్తానని హామీ ఇచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. ఇంతవరకూ ఆయన ఇచ్చిన మాట ఊసేలేదు. వారికి ఇచ్చిన హామీ ఏం చేశాడు అని కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. తెలుగు జనచైతన్య ప్రజా పాదయాత్రలో భాగంగా బుధవారం నాదెండ్ల మనోహర్ మండలంలోని తేలప్రోలు, సోమసుందరపాలెం గ్రామాల్లో ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వైసీపీ జగన్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందేలేదన్నారు. ముస్లింలు వైసీపీ సోషల్ మీడియా చేసే విషప్రచారాన్ని నమ్మవద్దన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ముస్లింలకు చేసిందేమీ లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న పలు పథకాలను నిలుపుదలచేసి వారిని మరింతగా దెబ్బతీసేలా పాలన చేశాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో అపోహలకు తావులేకుండా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

తెనాలి రూరల్, మే 1: పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి మనోహరం, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మిలు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కఠెవరంలో గ్రామ సర్పంచ్ బండికళ్ళప్రసాద్, ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి డాక్టర్ మనోహరం, రాజ్యలక్ష్మిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి పార్టీల మేనిఫెస్టోలోని పథకాలను గ్రామస్తులకు తెలిపి వాటి ద్వారా పొందే ప్రయోజనాలను వివరించారు.



కఠెవరంలో ప్రచారం చేస్తున్న మనోహరం, రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ ప్రసాద్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం: ధూళిపాళ్ళ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

చేబ్రోలు, మే 1: ఎన్డీఏ కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు మండలంలోని సుద్ధపల్లి, తోట్లపాలెం, మంచాల గ్రామాలో బుధవారం టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్రకుమార్‌కు ఆయా గ్రామాల ప్రజలు తాము ఎదర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల గురించి వివరించారు. అనంతరం సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల అధికారం ఇస్తే అహంకారంతో అవినీతి అరాచకాలకు వైసీపీ పాల్పడిందని ఆరోపించారు. గ్రామాలో అభివృద్ధిని పూర్తిగా నిలిపివేశారని ఆరోపించారు. ఆంక్షల పేరుతో బూటకపు సంక్షేమాన్ని అమలు చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రానున్న రోజులో ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభ్యున్నతి: జ్యోతిర్మయి

పొన్నూరు టౌన్, మే 1: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తేనే మహిళల అభ్యున్నతి సాధ్యం అని ధూళిపాళ్ళ జ్యోతిర్మయి అన్నారు. మండల పరిధిలోని చింతలపూడిలో బుధవారం కూటమి అభ్యర్థులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్ విజయం కోసం జ్యోతిర్మయి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల మ్యానిఫెస్టో పత్రాలను ఇంటింటికి వెళ్లి అందచేశారు. ప్రచారంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలిస్తా

● సుందర నగరంగా గుంటూరును తీర్చిదిద్దుతా

● ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

● డిప్యూటీ మేయర్ షేక్ సజీలా టీడీపీలోకి

● జగన్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించేయాలన్న పెమ్మసాని

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో చాలా కాలనీల్లో ఎవరికైతే పట్టాలు లేవో వారందరికి పట్టాలిస్తాని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజాగళం రోడ్‌షో అనంతరం జిన్నాటవర్ సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో చంద్రబాబు ప్రసంగించారు. ఇంటి స్థలాలు లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ఉచితంగా అంద జేస్తామన్నారు. గతంలో ఇక్కడ రోడ్లు విశాలంగా ఉండేవని, ఈ ఐదేళ్లలో వాటిని ఛిన్నాభిన్నం చేశారన్నారు. యూజీడీ పూర్తి చేయకుండా మొత్తం భ్రష్టుపట్టించారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గుంటూరు రోడ్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తామన్నారు. గ్రామాల నుంచి మండలాలకు అక్కడి నుంచి పట్టణాలు, నగరాలకు రోడ్లు వేస్తామన్నారు. గుంటూరుని ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుంటూరు లోక్‌సభ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు అబ్దుల్ కలామ్‌ను రాష్ట్రపతిని చేస్తే, ఈ జగన్ అబ్దుల్ సలామ్‌ను కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేలా చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం జ్ఞానాన్ని ఇచ్చే యూనివర్సిటీలు తెస్తే, వాళ్లు బూతుల సంస్కృతిని తెచ్చారన్నారు. చదువుకున్నోడికి ఉద్యోగాలు రావు, ఉద్యోగాలకు జీతాలు రావు, ఒక రాజధాని లేదు, ఒక ఉద్యోగం రాదు.. అందుకే ఈ జగన్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించివేయాలన్నారు. తూర్పు అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ 2014లో బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని నడిపినా కూడా ముస్లిం మైనార్టీలకు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూసి, దేశంలో ఏ నేత చేయని ముస్లిం సంక్షేమం చంద్రబాబు అందించార న్నారు. సైకో పరిపాలనలో ముస్లింలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు జరుగు తున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి బాబుకు తోడుగా ఉండాలన్నారు. పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి జగన్ 151 దొంగల ముఠా ప్రజలను అశాంతికి గురిచేసిందన్నారు. ఆ అశాంతి నుంచి బయట వేసే మహోన్నత నాయకుడు చంద్రబాబు వస్తున్నాడని, ఆంధ్ర రాష్ట్రం ఊపిరి పీల్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బహిరంగ సభా వేదికపై వైసీపీకి చెందిన డిప్యూటీ మేయర్ షేక్ సజీలా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. .

సరిగ్గా 10 గంటలకు ముగించిన చంద్రబాబు

భారీ రోడ్‌షో కారణంగా చంద్రబాబు ప్రజాగళం బహిరంగ సభకు చేరు కోవడానికి బాగా ఆలస్యమైంది. రాత్రి ఏడు గంటల సమయంలో ప్రారంభ మైన రోడ్ షో సభా ప్రాంగణానికి చేరుకోవడానికి 2 గంటల 20 నిమిషాల సమయం పట్టింది. ఐదు కిలోమీటర్ల పొడవునా ప్రజలు బారులుదీరడంతో వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చాలా కూడళ్లలో ప్రజలు ఆయన వాహనాన్ని కదలనివ్వలేదు. కాగా రాత్రి 9.30 గంటలకు సభ ప్రారంభం కాగా తొలుత ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో మాట్లాడించి ఆ తర్వాత చంద్రబాబు ప్రసంగించారు. సరిగ్గా 9.58కి తన ప్రసంగాన్ని ముగించారు. మిగతా రెండు నిమిషాల సమయాన్ని వైసీపీని వీడి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్నికల కోడ్‌ని పాటిస్తూ రాత్రి 10 గంటల కు సభ ముగించారు.

పెమ్మసాని, మాధవి, నసీర్‌లకు అభినందనలు


రోడ్ షోలో పెమ్మసాని, గల్లా మాధవి, నసీర్ చంద్రబాబు వాహనానికి ఇరువైపులా నిలుచుని ముందుకు సాగారు. ఐదారు కిలో మీటర్లకుపైగా సాగిన రోడ్ షోలో వారు వాహనాన్ని అంటిపెట్టుకుని ఉన్నారు. వీరిని చంద్రబాబు అభినందించారు.

ఘనంగా మేడే వేడుకలు

తెనాలి, మారీసుపేట మే 1: పట్టణ పరిసర గ్రామాలలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మేడే) ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం తెనాలి నియోజకవర్గ సీపీఐ ఆధ్వర్యంలో 138వ మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఎఐఎస్‌ఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తుంగ బాలస్వామి, కనపర్తి బెనహర్, బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరావు, ఎఐవైఫ్ పట్టణ కార్యదర్శి రాజేష్ బిల్లా, గుండు శివ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట మే 1: స్థానిక చెంచుపేటలోని కరెంట్ ఆఫీస్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ సభ్యులు మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయుకులు గురుబ్రహ్మం, నాయకులు, కార్మికులు, అభిమానులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, మే 1 : విద్యుత్ ఉద్యోగులు, ఆటో కార్మిక సంఘాలు బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నాయి. చెంచుపేటలోని డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట 1104 యూనియన్ పతాక వందనం చేశారు. కార్యదర్శి పురుషోత్తమరావు, బాషా, సురేష్, రాజు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. కొల్లిపర ఎల్ఎం రాఘవయ్య, వెంకటేశ్వరరావు, శివనాగేశ్వరరావు, నాగరాజు, ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ములకా శివసాంబిరెడ్డి, ప్రసాదరావు, యాకోబు, జ్యోతి కుమార్ పాల్గొన్నారు. బస్టాండ్ వద్ద జరిగిన మేడే వేడుకలలో పెన్నర్స్ కార్యాలయంలో రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు పోరాటం చేయాలని గద్దె రవీందర్ పిలుపునిచ్చారు. సుబ్రహ్మణ్యం, శంకరరావు, ములకా శివసాంబిరెడ్డి, ఆదినారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయుసీ ఆధ్వర్యంలో చెంచుపేటలో జెండా ఆవిష్కరిస్తున్న గురుబ్రహ్మం తదితరులు

● పొన్నూరు టౌన్, మే 1: శ్రమ జీవుల పోరాట ఫలితమే మేడే అని పౌరహక్కుల సంఘం నాయకుడు డాక్టర్ టి రాజారావు అన్నారు. బుధవారం పొన్నూరు పట్టణంలో పలు ప్రాంతాలలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ టి రాజారావు హాస్పటల్ రోడ్డులో మే డే పతాకాన్ని ఎగురవేసి అమరులైన కార్మికులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మే డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. పతాకాలను కార్యదర్శి నిమ్మకూరి రమేష్ బాబు ఎగురవేసి అమరవీరులకు నివాళ్లు అర్పించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: న్యాయాధికారి

తెనాలి క్రైం, మే 1: తమ ఓటు హక్కును ఏ విధిమైన ప్రలోభాలకు, ఒత్తిళ్ళకు గురి కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ విభాగం) పి.రాజశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు బుధవారం స్థానిక చినరావూరు పార్కులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి పౌరుడు సమాజంపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హక్కులతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల గురించి ప్రజలకు వివరించారు. న్యాయసేవాధికార సంస్థ అర్హులైన వారికి న్యాయసేవలను అందిస్తుందని ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని, కార్మికులు తమ హక్కుల గుర్తెరగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ఒన్‌టౌన్ పోలీసులు, పిఎల్‌వి యర్రంశెట్టి అనీల్‌కుమార్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.